RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..



**నేర పరిశోధనలో కొత్త అధ్యాయం.. సీఐడీ విభాగంలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్ ఆవిష్కరణ**

కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ క్రైమ్ అనాలిటిక్స్ సిస్టమ్ ప్రారంభం

నేర పరిశోధన, డేటా విశ్లేషణ, బాధితుల అభిప్రాయాల సేకరణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శనివారం, జూన్ 13, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 55 | పేజీలు: 8 | వెల : రూ.1

**టైటిల్ ఫైట్**


## కవిత Vs కేటీఆర్



హైదరాబాద్, జూన్ 12, ( వాయిస్ టుడే ) : తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ అనే మూడు అక్షరాలు ఇప్పటికీ భావోద్వేగాన్ని, చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఆ పేరును తమకు కేటాయించాలని అనేక పార్టీలు ఎన్నికల సంఘం (ఈసీ) ముందు పోటీ పడుతుండగా, బీఆర్ఎస్ నేతలు ఆ పేరు ఎవరికీ ఇవ్వకూడదని ఫిర్యాదు చేశారు. ఇది కేవలం పేరు వివాదం కాదు. ఇది తెలంగాణ ఉద్యమ వారసత్వం ఎవరి చేతుల్లో ఉండాలి, ఓటర్ల ముందు గుర్తింపు ఎలా ఉండాలి అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. 2022లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ ఖాళీగా ఉంది. ఆ పేరు కోసం కొత్త పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇందులో కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' ప్రముఖంగా ఉంది. ఆ పార్టీ పేరు ప్రకటనపై 600కి పైగా అభ్యంతరాలు వచ్చాయి.బీఆర్ఎస్ మద్దతుదారులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాన్య ప్రజల నుంచి ఈసీకి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కవిత పార్టీ నేతలు త్వరలో ఎన్నికల సంఘాన్ని నేరుగా కలిసి తమ వాదనను వినిపించనున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' కూడా టీఆర్ఎస్ పేరును తమకు కేటాయించాలని ఈసీని ఆశ్రయించింది. తెలంగాణ బయటి నుంచి వచ్చిన ఈ ప్రయత్నం, టీఆర్ఎస్ పేరు కేవలం తెలంగాణలోనే కాకుండా, సరిహద్దు ప్రాంతాల్లోని తెలుగు మాట్లాడే ప్రజల్లో కూడా గుర్తింపు కలిగి ఉందని చెబుతోందిభారతీయ రాజకీయాల్లో పార్టీ పేరు కేవలం ఒక లేబుల్ కాదు. అది ఓటర్ల మనసుల్లో నిలిచిపోయిన బ్రాండ్. టీఆర్ఎస్ పేరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంతో ముడిపడి ఉంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలకు ఇది గౌరవం, గుర్తు. కొత్త పార్టీ ఆ పేరును ఉపయోగించుకుంటే, ఓటర్లు సులభంగా

(మిగతా 2వ పేజీలో)

## కేంద్ర మంత్రి పదవా... గవర్నరా...



విజయవాడ, జూన్ 12, ( వాయిస్ టుడే ) : ఢిల్లీలో పర్యటించిన చంద్రబాబుకు కేంద్రంలోని పెద్దలు బిగ్ ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేసేందుకు బీజేపీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న పార్టీల జోరు.. ఇండియా కూటమి వేస్తున్న అడుగులను నిశితంగా గమనిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాలు.. ప్రస్తుత కూటమిని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.దీనిలో భాగంగా దక్షిణాదిలో తమకు కీలక పార్టీలుగా ఉన్నటీడీపీ, జనసేనలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ప్రధానంగా టీడీపీకి ఒక గవర్నర్ పోస్టును.. లేదా కేంద్ర మంత్రి వర్గంలో మరో బెర్త్‌ను ఆఫర్ చేసినట్టు జాతీయ రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిని ఒక ఎంపీ కూడా ధ్రువీకరించారు. చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు నిర్ణయమే ఫైనల్. మేం రెండూ కావాలని అడుగుతున్నాం. అని ఉత్తరాంధ్రకు చెందిన ఓ ఎంపీ వ్యాఖ్యానించారు.ప్రస్తుత లెక్క ప్రకారం చూస్తే.. టీడీపీకి రెండు మంత్రి పదవులు ఉన్నాయి. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్రంలో మంత్రులుగా ఉన్నారు. ఇక, గవర్నర్‌పోస్టుల విషయానికి వస్తే.. గోవా గవర్నర్‌గా విజయనగరం మాజీ ఎంపీ.. పూసపాటి అశోక్ గజపతి రాజు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో కేంద్రమంత్రి పదవితోపాటు.. మరో గవర్నర్ సీటును కూడా టీడీపీ ఆశిస్తున్న విషయం ఇటీవల కాలంలో చర్చకు వస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమికి టీడీపీ కీలక మద్దతు దారుగా ఉంది.తమకు మరో రెండు పదవులు కావాలని.. కొన్నాళ్లుగా చంద్రబాబు ఢిల్లీ పెద్దలను కోరుతున్నారు. ఈ క్రమంలో తాజాగా బాబు కోరికను మన్నించి.. కూటమికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని సహా కీలక నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఒక గవర్నర్ లేదా.. ఒక మంత్రి పదవిని ఇస్తామని చెప్పారని తెలిసింది. దీనిపై తన పార్టీ నాయకులతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని బాబు కూడా రిప్లయి ఇచ్చారని సమాచారం. ఇక, పార్టీ వర్గాల కథనం మేరకు రెండూ కావాలన్నది చంద్రబాబు ఉద్దేశం. దీనిని ఒప్పించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని కూడా సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

### అటు పవన్ కు పక్కా ప్లాన్

జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తన వ్యూహాన్ని దాదాపు తేల్చేశారు. రాజకీయంగా తనకు ఉన్న లక్ష్యాన్ని కూడా వివరించారు. దేశాన్ని ఐక్యం చేయడంతోపాటు.. ఉత్తర-దక్షిణ ప్రాంతాలు అనే భేదాన్ని తుడిచి పెట్టి.. అందరూ ఒక్కటే అనే విధంగా దేశాన్ని కలిపి ఉంచాలన్న తన మనసులోని భావాలను వెల్లడించారు. అదేసమయంలో తన టార్గెట్ కూడా కాంగ్రెస్ పార్టీనేనని ఆయన పరోక్షంగా చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ విధానాల కారణంగానే దేశంలో విభజన వాదం వచ్చిందని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలను విడదీసినందుకు, తెలంగాణ ఇచ్చినందుకు తనకు బాధలేదన్న ఆయన.. విభజన చేసిన తీరును, ఏపీకి మిగిల్చిన కష్టాలపైనే తన ఆవేదన అని పేర్కొన్నారు. దీనికి మూల కారణం.. కాంగ్రెస్ పార్టీనేనని

(మిగతా 2వ పేజీలో)

## 14న కాక్ రోచ్ పార్టీ నిరసన




హైదరాబాద్, జూన్ 12, (వాయిస్‌టుడే) : దేశ రాజకీయాల్లో ' కాక్రోచ్ జనతా పార్టీ ' ఓ సంచలనం. ఓ కేసులో నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్న జీవులు'తో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పోల్చడంతో సీజేపీ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే ప్రధాన రాజకీయ పార్టీలకు మించి ఫోలోవర్లు వచ్చారు. ఐదు రోజుల వ్యవధిలోనే రెండు కోట్ల మంది ఫాలోవర్లకు చేరుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి యువతలో అసంతృప్తి ఎలా ఎగిసిపడుతుందనడానికి ఇదే ఓ మచ్చు తునక. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై రాజధానిలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో మొదటిసారి ప్రత్యక్ష నిరసన చేపట్టారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ దేశవ్యాప్త ఆందోళన చేపడతామని ఆ ధర్నాలోనే దీప్కే ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో సీజేపీ తొలి నిరసన జూన్ 14న హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చేపట్టనుంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షా విధానాలలో సంస్కరణలు కోరుతూ చేపట్టిన 'గోయింగ్ నేషనల్' ఉద్యమంలో ఈ ఆందోళనలు ఒక భాగమని సీజేపీ చెబుతోంది. సీజేపీ విడుదల చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నిరసన జూన్ 14న ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో జరగనుంది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సభ్యులు ఇందులో పాల్గొంటారని అంచనాతో శాంతియుత ప్రదర్శనకు పిలుపునిచ్చారు.అదే రోజున సాయంత్రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో భారీ నిరసన జరుగుతుందని తెలిపింది. దక్షిణాదిన విస్తరణలో భాగంగా ఈ రెండు నిరసనలు చేపట్టినట్టు సీజేపీ పేర్కొంది. జూన్ 11న మహారాష్ట్రలోని పుణేలో నిరసన చేపట్టింది. జూన్ 12న ఉత్తర్ ప్రదేశ్ లక్నో (ఇకో గార్డెన్)లో, పంజాబ్‌లో జూన్ 13న అమృత్‌సర్‌లో, జూన్ 14 హైదరాబాద్, బెంగళూరు, జూన్ 15న రాజస్థాన్ రాజధాని జైపూర్, జూన్ 20 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించింది.ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల జాప్యం, నియామకాలు, ప్రవేశ పరీక్షలలో పారదర్శకత లోపించడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ నిరసనల లక్ష్యమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసన ఈ ఉద్యమంలో చివరి, అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. విద్యా రంగంలోని వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యుడిగా భావిస్తున్న విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని దీప్కే పేర్కొన్నారు.ఇటీవలి నిరసనలలో విద్యార్థులు, యంగ్ ప్రొఫెషనల్స్, పౌర సమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు కూడా హాజరైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. వీరిలో చాలామంది మాస్కులు ధరించి, ప్లకార్డులతో నిరసనలలో పాల్గొనడం సీజేపీకి పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు నిరసనలు దక్షిణాదికి కూడా విస్తరిస్తున్నందున జూన్ 20న ఢిల్లీలో జరిగే ముగింపు ర్యాలీకి ముందు దేశవ్యాప్తంగా ఊపును తీసుకొచ్చేందుకు సీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు.



## మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది: హరీశ్‌రావు

### జమ్మికుంట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

### రైతు సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపణ

జమ్మికుంట, జూన్ 12: : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని, రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంటలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 నుంచి ఇప్పటివరకు హుజురాబాద్ ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో

(మిగతా 2వ పేజీలో)

## 19న హైదరాబాద్‌కు పవన్



హైదరాబాద్, జూన్ 12, (వాయిస్‌టుడే) : ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎంత యాక్టీవ్ గా ఉన్నాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఒకపక్క పాలన పరంగా తనదైన మార్కు తో ముందుకు వెళ్తూ , మరోపక్క జనసేన పార్టీ ని బలోపేతం చెయ్యడానికి అన్ని విధాలుగా ప్లానింగ్ చేస్తున్నాడు. జనసేన పార్టీ ని కేవలం ఆంధ్ర ప్రదేశ్ కి మాత్రమే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రాంతానికి కూడా విస్తరింపజేసే ప్రయత్నం చేస్తున్నాడు. రీసెంట్ గా పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సృష్టించిన అలజడి ఎలాంటిదో కళ్లారా చూసాము. కావాలని ఆయన్ని టార్గెట్ చేస్తూ , కాంగ్రెస్ పార్టీ జనసేన క్యాడర్ ని , జనసేన నాయకులను తెలంగాణ వ్యాప్తంగా యాక్టీవ్ అయ్యేలా చేసింది. ఒకపక్క తెలంగాణ పై తన ఫోకస్ ప్రస్తుతానికి లేదని పవన్ కళ్యాణ్ చెప్తూనే , మరోపక్క అక్కడ ఆ పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా సిద్ధం అవుతున్నాడు.అందులో భాగంగా ఈ నెల 19 న ఆయన తెలంగాణ లో జనసేన పార్టీ పీకార్యాలయాన్ని గ్రాండ్ గా ప్రారంభించబోతున్నట్టు సమాచారం. ఏ ప్రాంతం లో ఆయన ఈ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నాడు అనేది ప్రస్తుతానికి తెలియదు. మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. పవన్ కళ్యాణ్ కి ప్రస్తుతం తెలంగాణ మీద ఆసక్తి లేకపోయినప్పటికీ,జనసేన పార్టీ క్యాడర్ మాత్రం ఒప్పుకోవడం లేదు , ఎట్టి పరిస్థితిలోనూ తెలంగాణ లో జనసేన పార్టీ ని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాల్సిందే అని పవన్ పై ఒత్తిడి తెస్తున్నారు. అందుకే వాళ్ళ కోసం ఆయన ఇకపై తెలంగాణ పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాదు ఆయన రీసెంట్ గా జరిగిన ఒక ఇంటర్వ్యూ లో కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడడం చూస్తుంటే , రాబోయే రోజుల్లో ఆయన అధికార కాంగ్రెస్ ని చాలా గట్టిగానే టార్గెట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత మాత్రం నిజముందో చూడాలి.



## అతి త్వరలో సింగరేణి మెడికల్ బోర్డు పునఃప్రారంభం

### పారదర్శకంగా నిర్వహించి అర్హుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలి: భట్టి విక్రమార్క

### శనివారం 335 మందికి నియామక పత్రాల పంపిణీ

హైదరాబాద్, జూన్ 12: సింగరేణి కార్మికులకు శుభవార్త అందిస్తూ, వివిధ కారణాలతో కొంతకాలంగా నిలిచిపోయిన సింగరేణి మెడికల్ బోర్డును అతి త్వరలో యథావిధిగా ప్రారంభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించి అర్హులైన ఉద్యోగుల వారసులకు

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

శనివారం, జూన్ 13, 2026

# అతి త్వరలో సింగరేణి మెడికల్ బోర్డు పునఃప్రారంభం

కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రులతో నిర్వహించిన సమావేశంలో మెడికల్ బోర్డు అంశం చర్చకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్మికుల ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి వారి ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. మెడికల్ బోర్డు ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు ఈ నెల 13న మంచిర్యాలలో నిర్వహించే కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల సమస్య పరిష్కారంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. దీనిపై న్యాయపరమైన సలహాలు తీసుకుంటున్నామని, నిబంధనల మేరకు సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సంక్షేమం

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వీటిలో 555 ప్రత్యక్ష నియామకాలు, 2,102 కారుణ్య నియామకాలు ఉన్నాయని చెప్పారు. కారుణ్య నియామకాల గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచడంతో ఇప్పటికే 200 మందికి పైగా లబ్ధి చేకూరిందన్నారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలోని 40 వేల మంది ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. అదనంగా ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా, కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమా సదుపాయాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో కార్మికులకు లాభాల వాటాగా రూ.1,500 కోట్లను చెల్లించినట్లు పేర్కొన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా వరుసగా బోనస్‌లు



అందజేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ, గోదావరిఖనిలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టామని చెప్పారు. వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భవిష్యత్తులో కొత్త బొగ్గు గనులు, కొత్త ప్రాజెక్టుల ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

# నేర పరిశోధనలో కొత్త అధ్యాయం..
# సీఐడీ విభాగంలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్ ఆవిష్కరణ

## కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ క్రైమ్ అనాలిటిక్స్ సిస్టమ్ ప్రారంభం
## నేర పరిశోధన, డేటా విశ్లేషణ, బాధితుల అభిప్రాయాల సేకరణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

హైదరాబాద్, జూన్ 12: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ నేరాల స్వరూపం కూడా వేగంగా మారుతోందని, అలాంటి పరిస్థితుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించడమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు మూల సూత్రమని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అన్నారు. నేర నియంత్రణ, దర్యాప్తు, సైబర్ నేరాల ఛేదన, డేటా విశ్లేషణ వంటి రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు షీ సైబర్ ల్యాబ్‌ను డీజీపీ శుక్రవారం ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత స్మార్ట్ క్రైమ్




అనాలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్, స్మార్ట్ కాన్ఫరెన్స్ సదుపాయాలతో రూపొందించిన ఈ వ్యవస్థ నేర పరిశోధనలో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ శాఖ సాంకేతిక వినియోగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ పోలీసులు వినూత్న ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ ఫోరెన్సిక్ దర్యాప్తు, డేటా ఆధారిత పోలీసింగ్, క్రైమ్ అనాలిటిక్స్ రంగాల్లో విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు నేరాలపై వేగవంతమైన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ పోలీస్ శాఖ నిరంతరం కొత్త సాంకేతిక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన 'టీ-స్పార్క్' (టీ-స్పార్క్) వంటి సాంకేతిక బృందాలు పోలీసింగ్‌లో ఆధునిక విధానాలను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.

### స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ప్రత్యేకతలు

సీఐడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లో అనేక వినూత్న సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. మాట్లాడుతున్న వ్యక్తిని కెమెరా స్వయంచాలకంగా గుర్తించి అతని వైపు తిరగడంతో పాటు, మాట్లాడే వ్యక్తిపై జూమ్ అవుతూ వీడియో, ఆడియో రికార్డింగ్ నిర్వహిస్తుంది. సమావేశాల్లో చర్చించిన అంశాలను డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు అవసరమైనప్పుడు తిరిగి విశ్లేషించే అవకాశం ఈ వ్యవస్థ కల్పిస్తుంది. మానిటర్ లేదా డిజిటల్ బోర్డుపై ఇచ్చిన సమాచారాన్ని గుర్తించి టెక్స్ట్, ఆడియో లేదా నివేదిక రూపంలో మార్చగల సామర్థ్యం కూడా దీనికి ఉంది. కృత్రిమ మేధస్సు సాయంతో సమాచారాన్ని విశ్లేషించి క్రైమ్ మ్యాపింగ్, డేటా ఫిల్టరింగ్, నేర ధోరణుల అధ్యయనం, కేసుల సమీక్ష వంటి అంశాలను మరింత వేగవంతంగా, ఖచ్చితంగా నిర్వహించవచ్చు. బాధితులు, ఫిర్యాదుదారుల అభిప్రాయాలను డిజిటల్ రూపంలో నమోదు చేసి భద్రపరచడం ఈ వ్యవస్థ మరో ప్రత్యేకత. దీంతో కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, ప్రజల స్పందన వంటి అంశాలపై సమగ్ర విశ్లేషణ చేయడం సులభమవుతుందని అధికారులు తెలిపారు. అలాగే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) వేదికలో కేసుల నమోదు, డేటా నిర్వహణ, విశ్లేషణ, ధృవీకరణ, అవసరమైన సవరణలు వంటి ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ సాంకేతిక వ్యవస్థ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ఆధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా నేర పరిశోధనలో ఖచ్చితత్వం పెరగడంతో పాటు దర్యాప్తు ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారుతుందని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ పోలీసింగ్‌ను మరింత సాంకేతికంగా బలోపేతం చేయడంలో ఈ ల్యాబ్‌లు కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీ ఏసీబీ & సీఐడీ చారుసిన్హా, డీఐజీలు నవీన్ కుమార్, నారాయణ నాయక్, పరిమళ హనా నూతన్, ఎస్పీ మద్దిపాటి శ్రీనివాస్, సీఐడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వానొస్తే...ఇంతేనా

## హైడ్రా, గ్రేటర్ మధ్య సమన్వయ లోపం

హైదరాబాద్. జూన్ 12, ( వాయిస్ టుడే ) : భాగ్యనగరంలో వానాకాలం ముంచుకొస్తున్న తరుణంలో బల్దియా యంత్రాంగం, హైడ్రా చేసిన ముందస్తు ఏర్పాట్లలోని లోపాలు తొలి వర్షానికే పూర్తిగా బయటపడ్డాయి. వర్షాలొస్తున్నాయంటూ వివిధ ప్రభుత్వ శాఖలతో వరుస సమన్వయ సమావేశాలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. క్షేత్రస్థాయిలో జరగాల్సిన సన్నద్ధతపై మాత్రం దృష్టి సారించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం మొదలయ్యాక అత్యవసర బృందాలు, ఇతర యంత్రాంగం ఏర్పాటుకు టెండర్లు పిలవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరోవైపు, హైడ్రా హడావుడి చూసి అంతా ఆ సంస్థే చూసుకుంటుందనే భావనతో నగరంలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు చేతులెత్తేయడంతో సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. దీని ఫలితంగా మంగళవారం కురిసిన వర్షానికి నగరవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వాహనదారులు అర్ధరాత్రి వరకు రోడ్లపైనే నరకయాతన అనుభవించారు.నగరంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వరద నాలాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం, నాలాల పూడికతీత పనులు సరిగా జరగకపోవడం ఈ ముంపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దీనికి తోడు ముంపు సమస్యను తక్షణమే సరిదిద్దే అత్యవసర బృందాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. మే నెల ప్రారంభం నుండే హైడ్రా ఆధ్వర్యంలో వర్షకాల సన్నద్ధతపై సమావేశాలు నిర్వహించి, అధికారులకు సూచనలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఆశించినట్లుగా లేదని ఈ ఒక్క వర్షంతో తేలిపోయింది.హైటెక్స్ సమీపంలోని జూబ్లీగార్డెన్ రోడ్డు నంబర్ 8 లో గతంలో భారీ వర్షం కురిస్తే 20 నిమిషాల పాటు వరద నీరు నిలిచేది. కానీ జూన్ 9న కురిసిన వర్షానికి ఇక్కడి కాలనీలు ఏకంగా నాలుగు గంటల పాటు వరద నీటిలో చిక్కుకుపోయాయి. రోడ్లపై నడుముల్లోతు నీరు చేరడంతో కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. ఈ ప్రాంతంలో మీనాక్షి టవర్స్, వాసవి టవర్స్ వంటి భారీ బహుళ అంతస్తుల ప్రాజెక్టులు నిర్మించడంతో సహజ వరద నీటి ప్రవాహ మార్గాలన్నీ మూసుకుపోయాయి. వరద నాలాల సామర్థ్యం ప్రవాహ మార్గాల గురించి ఆలోచించకుండా ఉన్నతాధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఇంజనీరింగ్ లోపాలతో రోడ్లు వేయడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయినా, సహాయం చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు ఎవరూ కనిపించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### రోజంతా కరెంట్ కట్...

కొన్ని గంటల క్రితం కురిసిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బల్దియా పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసింది. విద్యుత్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు



దూరంలో ఉన్న కాలనీలు సైతం 24 గంటలకు పైగా కరెంట్ లేక నరకయాతన పడ్డాయి. విపత్తులు తలెత్తినప్పుడు అన్ని విభాగాలు కలిసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని సైఫాబాద్, ఆజామాబాద్ డివిజన్లలో అధికారుల తీవ్ర జాప్యం వల్ల వినియోగదారులు కరెంట్ లేక నానాపాట్లు పడ్డారు. ముషీరాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వానకు పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడటంతో ఇనుప విద్యుత్ స్తంభాలు వంగిపోయి, లైన్లు తెగిపడటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అత్యవసర సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను వెంటనే తొలగించినప్పటికీ, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గాంధీనగర్, హెబ్రోన్ చర్చి వీధి, వై జంక్షన్, విద్యానగర్, ఎస్‌బీఐ బ్యాంక్ వీధి, సీపీఎం మార్క్స్ భవన్ రాష్ట్ర కార్యాలయం వీధి, అడిక్‌మెట్ డివిజన్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి ప్రాంతాల్లో 24 గంటలు గడిచినా సరఫరా పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### జోన్ల వారీగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల వివరాలు:

హైదరాబాద్ సెంట్రల్: 56 స్తంభాలు, సికింద్రాబాద్: 11 స్తంభాలు

హైదరాబాద్ సౌత్: 10 స్తంభాలుసైబర్ సిటీ: 8 స్తంభాలు

ఐటీ ఉద్యోగులు, వ్యాపారుల ఇబ్బందులు

దీర్ఘకాలిక విద్యుత్ కోతల కారణంగా వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచి) పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు చార్జింగ్ లేక లాప్‌టాప్‌లు పనిచేయక, ఫోన్లు స్విచ్ ఆఫ్ అయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కేబుల్ వైర్లు తెగిపోవడంతో ఇంటర్నెట్ సేవలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. విద్యానగర్, గాంధీనగర్, అడిక్‌మెట్ ప్రాంతాల్లోని 50కి పైగా అపార్ట్‌మెంట్లు, 100కు పైగా ఇండ్లలో కరెంట్ కష్టాలు తలెత్తడంతో వ్యాపారులు అద్దెకు జనరేటర్లను తెచ్చుకుని వ్యాపారాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అపార్ట్‌మెంట్లలో లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు నానాయాతన పడ్డారు. కరెంట్ లేకపోవడంతో మోటార్లు నడవక ట్యాంకుల్లో నీరు అయిపోయి, తాగునీటితో పాటు కనీస అవసరాలకు తీవ్ర కొరత ఏర్పడింది.

# కవిత Vs కేటీఆర్

ఆకర్షితులవుతారు. అదే సమయంలో, బీఆర్ఎస్ తన పాత పేరును రక్షించుకోవాలనుకుంటోంది. పేరు మార్చుకున్న తర్వాత కూడా, ప్రజలు ఇంకా బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారు.ఎన్నికల సంఘం ఈ వివాదంలో కీలక పాత్ర పోషించాలి. పార్టీల నమోదు నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న పార్టీ పేరుకు సమీపంలో ఉన్న పేర్లను అనుమతించకూడదు. ఆఖ ఫిర్యాదు, కవిత పార్టీపై వచ్చిన వందలాది అభ్యంతరాలు, మహారాష్ట్ర పార్టీ కోరిక ఇవన్నీ ఈసీ ముందు ఉన్నాయి. ఈసీ ఒకవేళ కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు ఇస్తే, బీఆర్ఎస్ మద్దతుదారుల్లో అసంతృప్తి పెరగవచ్చు. ఒకవేళ నిరాకరిస్తే, కొత్త పార్టీలు "వారసత్వం అడ్డుకుంటున్నారు" అనే ఆరోపణలు చేయవచ్చు. రెండు వైపులా రాజకీయ లాభనష్టాలు ఉన్నాయి. అందుకే ఈసీ త్వరగా, పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలి. అన్ని పార్టీలను పిలిచి విన్నపాలు విని, స్పష్టమైన కారణాలతో తీర్పు ఇవ్వాలి.ఎన్నికల సంఘం న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే, ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరింత పరిపక్వతను తీసుకురావచ్చు. లేకపోతే, ఇది మరిన్ని గందరగోళాలకు దారితీసే ప్రమాదం ఉంది. టీఆర్ఎస్ పేరు ఎవరిది అనేది న్యాయస్థానాలు లేదా ఎన్నికల సంఘం నిర్ణయించాలి. కానీ ఆ పేరు వెనుక ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశలు ఎవరూ దోచుకోకూడదు. అది మాత్రం తెలంగాణ ప్రజలే నిర్ణయించాలి.

# కేంద్ర మంత్రి పదవా... గవర్నరా...

స్పష్టం చేశారు. అంతేకాదు.. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ చేసిందే ఘోర తప్పిదమని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీని ఆడిపోసుకోవడం సరికాదని పేర్కొన్నా రు. ఆనాడే పార్లమెంటులో చట్టంలో చేర్చి ఉంటే సమస్య ఉండేది



కాదన్నారు. అంతేకాదు.. పలువురు ముఖ్యమంత్రులు(కాంగ్రెస్) ఉత్తరం, దక్షిణం అంటూ.. దేశానికి గోడలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తన దృక్పథంలో దేశం అంతా ఒక్కటేనని చెప్పారు. దేశ ఐక్యత కోసం.. ఎంతోమంది ప్రయత్నించారని.. కానీ.. కాంగ్రెస్ పార్టీ విభజన వాదాన్ని భుజాన మోస్తోందని చెప్పకనే చెప్పారు. తద్వారా.. పవన్ కల్యాణ్.. తన రాజకీయ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనేనని వెల్లడించడం గమనార్హం. దీనిని బట్టి రాబోయే రోజుల్లో జాతీయస్తాయి కావొచ్చు.. ప్రాంతీయ స్థాయి కావొచ్చు.. పవన్ వ్యూహం.. కాంగ్రెస్‌పైనే ఉంటుందన్న విషయం స్పష్టమవుతోంది.పవన్ వ్యాఖ్యలను నిశితంగా గమనిస్తే.. నిన్న మొన్నటి వరకు లేని ఉత్తేజం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఆయన ఏపీకి, తెలంగాణకు పరిమితమైతే.. తొలిసారి దేశ ఐక్యత, సమగ్ర వ్యూహం.. అన్ని ప్రాంతాలు ఒక్కటేనన్న భావనను వినిపించారు. తద్వారా.. దేశంలోని తటస్థులను ఆయన ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నారన్నది స్పష్టమవుతోంది. అయితే.. దీనివెనుక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు. ఇది పవన్‌ను జాతీయ నేతగా తీర్చిదిద్దినా ఆశ్చర్యం లేదని అంటున్నారు.

# మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది: హరీశ్‌రావు

గులాబీ జెండా ఎప్పుడూ ప్రజల మద్దతు పొందిందన్నారు. రైతు బంధు, దళిత బంధు వంటి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంక్షేమ పథకాలు హుజురాబాద్ నుంచే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రైతు బంధు ఆగలేదని, రైతుల ఖాతాల్లో వేల కోట్ల రూపాయలు జమ చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు, సాగునీటి ఇబ్బందులు పెరిగిపోయాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు బీమా అమలులో నిర్లక్ష్యం కారణంగా రైతు కుటుంబాలు నష్టపోతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న రైతు డిస్కం వల్ల రైతులకు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు సరిపడా విద్యుత్ అందడం లేదని, భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధులకు పెన్షన్లు, మహిళలకు ఆర్థిక సహాయం వంటి హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులపై కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలు ఇప్పుడు తప్పని తేలుతున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యత ఇప్పుడు ప్రభుత్వానికే అర్థమవుతోందని పేర్కొన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, డంపింగ్ యార్డ్ సమస్యపై అసెంబ్లీలో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యతిరేక వాతావరణం నెలకొందని, ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 824 నియోజకవర్గాల పెంపునకు ఈసీ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, జూన్ 12, ( వాయిస్ టుడే ) : దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని ఆర్థిక సలహా మండలి కీలక ప్రతిపాదనలు చేసింది. జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా పట్టణీకరణ, ఎస్సీ-ఎస్టీ జనాభా, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కొత్త నియోజకవర్గాల ఏర్పాటు చేపట్టాలని సూచించింది. ముఖ్యంగా చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో అక్కడి లోక్‌సభ స్థానాలను రెట్టింపు చేయాలని సిఫార్సు చేసింది.ప్రస్తుతం దేశంలో 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, తాజా ప్రతిపాదనలు అమలైతే వాటి సంఖ్య 824కు చేరే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను సుమారు 50 శాతం వరకు పెంచే విధంగా మోడల్‌ను రూపొందించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 170 నియోజకవర్గాలను పునర్విభజించాలని నివేదిక పేర్కొంది. వీటిలో 59 నియోజకవర్గాలను రెండు భాగాలుగా, 111 నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వెల్లడించింది.కొత్త ప్రతిపాదనల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఎంపీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే మొత్తం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం ప్రస్తుతం ఉన్న 23.7 శాతం స్థాయిలోనే కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించారు. కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాలు 30కు, తమిళనాడులో 39 స్థానాలు 59కు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా అదనపు లోక్‌సభ స్థానాలు లభించే అవకాశముంది.దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 80 స్థానాలు 120కు పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. చిన్న నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజాప్రాతినిధ్యం మరింత మెరుగుపడటంతో పాటు దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం సుమారు 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సలహా మండలి అంచనా వేసింది.ఇక పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా 'మహిళా పోలింగ్ బూత్‌లు' ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. అలాగే 2027 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలు అమలైతే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# టీజీపీఎస్సీ ఫీజుల పెంపు – నిరుద్యోగులపై ఆర్థిక భారం

**టీజీపీఎస్సీ ఫీజుల దోపిడీని వెంటనే ఉపసంహరించాలి**

**నిరుద్యోగ యువతపై 400 శాతం ఫీజుల భారం అన్యాయం**

**టీజీపీఎస్సీ అదనపు కార్యదర్శి సరితకు ఏఐవైఎఫ్ బృందం వినతి**

**ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్**




నాగారం, జూన్ 12:-(వాయిస్ టుడే) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇటీవల విడుదల చేసిన పలు ఉద్యోగ నోటిఫికేషన్లలో అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజును ?200 నుండి 1000కు పెంచింది. అంటే ఒకేసారి 400% పెంపు జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 500, ఓసి, బిసి అభ్యర్థులకు 1000 ఫీజు నిర్ణయించారని, పలు తాజా నోటిఫికేషన్లలో ఇదే ఫీజు అమలులో ఉందన్నారు, పెంచిన ఫీజులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నాంపల్లి లోని టీజీపీఎస్సీ కార్యాలయంలో అదనపు కార్యదర్శి సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నత్తనడకన సాగుతుండగా, మరోవైపు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులపై వేల రూపాయల భారం మోపడం అత్యంత అన్యాయమన్నారు . ప్రస్తుతం ఒకే శాఖలోని పోస్టులను కూడా వేర్వేరు నోటిఫికేషన్లు గా విడుదల చేయడం వల్ల అభ్యర్థులు ఒక్కో నోటిఫికేషన్‌కు విడివిడిగా ఫీజు చెల్లించాల్సి వస్తోందన్నారు . దీంతో ఒక నిరుద్యోగ అభ్యర్థి కేవలం దరఖాస్తులకే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల రోడ్లు-భవనాల శాఖలో ఎఈఈ 222పోస్టులు (సివిల్), 49 ఎఈఈ (ఎలక్ట్రికల్) పోస్టులు ,19 కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పోస్టులకు, 24 డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయడంతో అభ్యర్థులు ఒక్కో నోటిఫికేషన్‌కు విడిగా ఫీజు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఒక నిరుద్యోగ ఇంజనీరింగ్ అభ్యర్థి మూడు నోటిఫికేషన్లకు దరఖాస్తు చేస్తే కేవలం ప్రాసెసింగ్ ఫీజులకే ?3000 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ఇప్పటికే నిరుద్యోగం, కోచింగ్ ఫీజులు, హాస్టల్ ఖర్చులు, ప్రయాణ వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న యువతపై అదనపు భారంగా మారిందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నత్తనడకన సాగుతుండగా, మరోవైపు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులపై వేల రూపాయల భారం మోపడం అత్యంత అన్యాయమన్నారు . ప్రస్తుతం ఒకే శాఖలోని పోస్టులను కూడా వేర్వేరు నోటిఫికేషన్లుగా విడుదల చేయడం వల్ల అభ్యర్థులు ఒక్కో నోటిఫికేషన్‌కు విడివిడిగా ఫీజు చెల్లించాల్సి వస్తోందన్నారు . దీంతో ఒక నిరుద్యోగ అభ్యర్థి కేవలం దరఖాస్తులకే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసే హక్కును డబ్బున్న వారికి మాత్రమే పరిమితం చేసే విధంగా ఈ ఫీజుల పెంపు కనిపిస్తోందని, ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం నిరుద్యోగుల జేబులు ఖాళీ చేయడం సరికాదన్నారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే కనీసం దరఖాస్తు చేసే హక్కును అమ్మకానికి పెట్టొద్దని వారు అన్నారు. నిరుద్యోగ యువతపై ఆర్థిక దాడిగా మారిన ఈ ఫీజుల పెంపును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్ పాల్గొన్నారు.



## వెంకులోని గుట్టలో సరస్వతి హోమం

నాగారం, జూన్ 12:-(వాయిస్ టుడే): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం లోని కమల ఏకాదశి సందర్భంగా వేంకులోని గుట్టలో శ్రీ సరస్వతీ దేవి – శ్రీ హయగ్రీవ స్వామి మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక హోమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో విద్యార్థులకు రుత్వికులు ఆశీర్వచనాలు అందజేసారు. అనంతరం పిల్లలకు తీర్థప్రసాదాలు అందజేసారు.



## ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్

కుత్బుల్లాపూర్ జూన్ 12(వాయిస్ టుడే ): ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాయొక్క జర్నలిస్టుల పిల్లలకు 2026-27 సంవత్సరాలకు ఫీజుల్లో 50% రాయితీ జిల్లా విద్యాధికారి (డి ఈ ఓ ) వినతిపత్రం అందజేశారు. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దామర జగదీశ్వర్ గుప్తా, ఏ గోవిందరావు లు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని సూచించారు చేస్తున్నాం. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ నాయకులు శివకుమార్, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శ్యాం ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఏ అవగాహన మరియు శిక్షణ సదస్సులో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ జూన్ 12(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని కొంపల్లి ఎస్ఎన్ఆర్ గార్డెన్ లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బిఎల్ఏ అవగాహన మరియు శిక్షణ సదస్సుకు స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఈ బిఎల్ఏ శిక్షణ కార్యక్రమ ఇంచార్జ్ ఎం ఎ ఫహీమ్ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ పార్టీ బలోపేతనికి, ఎన్నికల ప్రక్రియ సమర్థ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్ల ( బి ఎల్ ఏ ) పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నాను. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చాను, ప్రతి బూత్ స్థాయి లో ఉన్నటువంటి ఏజెంట్లు సర్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని నకిలీ ఓటర్ల తొలగించే విధంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ బూత్ లెవెల్ ఆఫీసర్ తో కలిసి క్షేత్ర స్థాయి లో పనిచేయాలని పిలుపునిచ్చారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ శిక్షణ సదస్సులో స్థానిక ఇన్చార్జ్ హనుమంత్ రెడ్డి మరియు కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కిషోర్ రెడ్డి, మైపాల్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,స్థానిక డివిజన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే దుస్తులను అందించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్**

కుత్బుల్లాపూర్ జూన్ 12(వాయిస్ టుడే ): సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని తెలుసుకోవడానికి నేడు జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సిపిఐ బృందం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని కానీ నేటికీ ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ప్రభుత్వం నుండి అందాల్సిన విద్యార్థుల యూనిఫాం అందలేదని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బోధించడానికి జీవశాస్త్ర ఉపాధ్యాయుడు లేరని మరియు పారిశుద్ధ్య రక్షణ సమస్యలు ఉన్నాయని సందర్శనలో తెలిసిందని కావున ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు అందించి, తగిన బోధన సిబ్బంది ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎం సహదేవరెడ్డి ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు సిపిఐ నాయకులు కృష్ణ శ్రీనివాస్ చారి యువజన నాయకులు కార్తీ క్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను పరామర్శించిన శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ జోన్ 12(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ గాగిల్లాపూర్ తాండ మరియు దుండిగల్ తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జగన్ నాయక్ ఊపిరి తితులకు సంబందించిన వ్యాధితో బాధ పడుతున్నారు, అదేవిధంగా కిడ్నీ ఊపిరితూతులకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కాత్రోత్ లక్ష్మణ్ నాయక్ మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్ కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పరామర్శించారు. వారు మాట్లాడుతూ అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం కిడ్నీ బాధితులు అయినా లక్ష్మిబాయి మరియు ఫకీరా రాజు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలు తెలియజేస్తూ అక్కడ ఉన్న ప్రధాన సమస్య వాయు కాలుష్యం, కలుషితమైన నీళ్ల కారణంగా, తాండ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజలకు మంచినీళ్లు సౌకర్యం కల్పించి ఆదుకోవాలనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ప్రెసిడెంట్ అమర్ సింగ్ నాయక్, వెంకటేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు, నర్సింగ్ నాయక్, కుమార్ నాయక్, రాజు నాయక్, వాసు నాయక్, పటేల్ రెడ్యా నాయక్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్వామికి చందన సుగంధ ఫల సహిత పంచామృతాభిషేకాలు



నాగారం, జూన్ 12:-(వాయిస్ టుడే): సత్యనారాయణ కాలనీలో వేంచేసియున్న శ్రీ రమా సత్యనారాయణ స్వామి, శ్రీ శిరిడీ సాయిబాబా, శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానమందు శ్రీపరాభవ నామ సంవత్సర అధిక జ్యేష్ట బ.త్రయోదశి భరణీ నక్షత్ర యుక్త శుక్రవారం నాడు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వార్ల మూల మూర్తులకు చందన సుగంధ ఫల సహిత పంచామృతాభిషేకము భక్తజన సమక్షమున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా స్వామి వారికి పుష్పార్చన అనంతరం మహానివేదన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు.

## ఆఫీసర్స్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



నాగారం, జూన్ 13:-(వాయిస్ టుడే) ఆఫీసర్స్ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్న సమస్యపై అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని ఆఫీసర్స్ కాలనీ సంక్షేమ సంఘం బాధ్యులు శ్యామల శంకర్ వంశరాజ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఈ మాట్లాడుతూ మేము చర్లపల్లి పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ నివాసితులమనీ, మా కాలనీలో గత కొన్ని రోజులుగా తీవ్రంగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యను మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నామని తెలిపారు. మా కాలనీలోని ప్రధాన రహదారి మరియు అంతర్గత వీధుల్లోని డ్రైనేజీ పైపులు పూర్తిగా పూడికతో నిండిపోయి, మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోంది. దీనివల్ల కాలనీ అంతా తీవ్రమైన దుర్వాసన వస్తుండటమే కాకుండా, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి. స్థానికులు, ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు వృద్ధులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు, కాలినడకన వెళ్లేవారు ఈ మురుగునీటిలోనే ప్రయాణించాల్సి వస్తోందని, స్థానిక సిబ్బందికి ఇప్పటికే పలుమార్లు మౌఖికంగా తెలియజేసినప్పటికీ ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదుని. వర్షాకాలం కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని కాలనీవాసులంతా ఆందోళన చెందుతున్నారు. కావున, దయచేసి మీరు ఈ విషయముపై తక్షణమే స్పందించి, సంబంధిత ఇంజనీరింగ్ లేదా శానిటేషన్ సిబ్బందిని పంపి, డ్రైనేజీ పూడికతీత పనులను పూర్తి చేయించి మా సమస్యను తీర్చాల్సిందిగా అత్యంత గౌరవంతో ప్రార్థిస్తున్నామని అధికారులను వేడుకున్నారు.



## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్.. ఎంపి ఈటెల

నాగారం, జూన్ 12:-(వాయిస్ టుడే): మల్కాజ్గిరి కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని కీసర డివిజన్ యాదగిరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్యాభివృద్ధి కోసం అంబేద్కర్ చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జలమండలి డిజిఎంను కలిసిన ఆల్ కాలనీ అసోసియేషన్



నాగారం, జూన్ 12:-(వాయిస్ టుడే) : నాగారం, రాంపల్లి డివిషన్‌ల పరిధిలో అన్ని కాలనీలకు త్రాగు నీటి సరఫరా మెరుగుపర్చి నాణ్యమైన నీటిని ఆయా కాలనీ వాసులకు అందించాలని శుక్రవారం జలమండలి డిజిఎం రమాదేవిని ఆల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ కలిసి విజ్ఞప్తి చేసారు. త్రాగు నీటి సమస్యతో పాటు కాలనీలలో ఇతర సమస్యలను చర్చించడం జరిగిందని ఆయన తెలిపారు. కాలనీల సమస్యలను తెలుసుకున్న డిజిఎం రమాదేవి సానుకూలంగా స్పందించారని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ జలమండలి మేనేజర్ సాయికిరణ్ గౌడ్ పాల్గొన్నారు.



## బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి: టీపీసీసీ నేతలు

కుత్బుల్లాపూర్ జోన్ 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొంపల్లి లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంపై బిఎల్ఏ.లకు అవగాహన శిక్షణ శిబిరం ఎస్ఎన్ఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఎస్ ఐ ఆర్ అబ్జర్వర్ ఫయీమ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి, హరీష్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎస్ ఎస్ ఎ కో–ఆర్డినేటర్ ఏపీ మిథున్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు,బి ఎల్ ఎ లు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంఎంసీ జాయింట్ కమీషనర్ ను కలిసిన స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను



నాచారం (వాయిస్ టుడే): మల్కాజిగిరి మున్సిఫల్ కార్పొరేషన్ జాయింట్ కమీషనర్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిప్పర్తి యాదయ్యను శుక్రవారం తార్నాకలోని ఆయన కార్యాలయంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ హైదరాబాద్ సెక్రటరీ కుమార్ షాను, టిఎస్పిఎ స్టేట్ జనరల్ సెక్రటరీ లక్ష్మి ఆనంద్ తదితరులున్నారు.

## బిఆర్ఎస్ పాలనలోనే హైదరాబాద్ బాగుండేది

### కేటీఆర్ తమ సమస్యలను వివరించిన కొంపల్లి శ్వేతశుభం రెసిడెన్స్ వాసులు



కుత్బుల్లాపూర్ జూన్ 12(వాయిస్ టుడే): బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆధ్వర్యంలో నంది నగర్ లోని వారి నివాసంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిసిన కొంపల్లి సర్కిల్ శ్వేతా శుభం రెసిడెన్సి ఐటీ ఉద్యోగులు కాంగ్రెస్ పాలనలో వారు పడుతున్న అవస్థలను కేటీఆర్ వివరించారు.

ఈ సందర్భంగా శ్వేతా శుభం రెసిడెన్స్ వాసులు, ఐటీ ఉద్యోగులు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోజు విడిచి రోజు త్రాగునీటి సరఫరాతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేవారిమని, ఇప్పుడు నాలుగు, ఐదు రోజులకు ఒకసారి లో ప్రెజర్ తో నీటి సరఫరా జరుగుతుందని తద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అదేవిధంగా కాలనీలో బోయిన్పల్లి నుంచి సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ పనులు గత సంవత్సరన్నర కాలంగా పూర్తిగా నిలిచిపోయాయని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అసెంబ్లీతోపాటు పలు వేదికలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినా ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేదని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు చేపడతామన్న మెట్రో పనులు ఆరంభం కాకపోవడంతో హైదరాబాద్ రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందితో తీవ్ర అవస్థలు పడుతున్నామని విన్నవించారు.

కొంపల్లి శ్వేతా శుభం రెసిడెన్స్ వాసుల సమస్యలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.... మన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలాది కోట్ల రూపాయలతో మౌనిక వసతులను అభివృద్ధి చేస్తూ హైదరాబాద్ నగరానికి పెట్టుబడులను తీసుకువస్తూ ఎంతో అభివృద్ధి పరిచామని, కానీ నేటి ఈ ప్రభుత్వంలో మౌలిక వసతులను నిర్వహణ చేయలేని అద్వాన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. శ్వేతా శుభం రెసిడెన్స్ వాసుల సమస్యల గురించి ప్రభుత్వంపై పోరాటం చేసైనా నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులను, త్రాగునీటి సరఫరా సమస్యతో పాటు మెట్రోను సాధిస్తామని హామీ ఇచ్చారు.

## అశోక్‌నగర్‌లో పారిశుధ్య సమస్యలు

### ప్రమాదకర మాన్‌హోల్‌పై ఆందోళన



సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ ప్రాంతంలో డివిజన్ నాయకులతో కలిసి మేకల కీర్తి హర్షకిరణ్ పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొట్టుకొచ్చిన వ్యర్థాలు గల్లీల్లో పేరుకు పోయినా ఇప్పటికీ అధికారులు తొలగించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా డ్రైనేజీ పూడికలు తొలగించే పనుల కోసం నాలాపై ఏర్పాటు చేసిన మాన్‌హోల్‌ను అధికారులు మూసివేయకుండా వదిలేయడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు తాత్కాలికంగా చెక్క ముక్కను అడ్డుగా పెట్టారని, అయితే మరోసారి వర్షం కురిస్తే అది కొట్టుకుపోయే అవకాశం ఉందని తెలిపారు. రాత్రి వేళల్లో లేదా వర్ష సమయంలో పిల్లలు, పెద్దలు గమనించకుండా ఆ రంధ్రంలో పడే ప్రమాదం ఉందని, దీంతో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, ప్రమాదకరంగా ఉన్న మాన్‌హోల్‌ను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని మేకల కీర్తి హర్షకిరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సతీష్ నేత, శ్యామ్‌రాజ్, భిక్షపతి, నాగరాణి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వాతావరణంలో జన్మదిన వేడుకలు

### మనవరాళ్లతో కలసి బండారు దత్తాత్రేయ ప్రత్యేక పూజలు





సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): మాజీ గవర్నర్, సీనియర్ నాయకుడు బండారు దత్తాత్రేయ తన జన్మదినాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు. ఈ మేరకు శుక్రవారం చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ను తన మనవరాళ్లతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు, దేశ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని దత్తాత్రేయ ప్రార్థించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. తన జన్మదినాన్ని భక్తి, ఆధ్యాత్మికత మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని దత్తాత్రేయ తెలిపారు. తెలంగాణ సమాజం శాంతి, సౌభ్రాతృత్వాలతో వర్ధిల్లాలని, యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్, దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుశీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆసుపత్రిలో రోగులకు పళ్ల పంపిణీ...**

అనంతరం నల్లకుంటలోని ఫీవర్ హాస్పిటల్ ను సందర్శించిన బండారు దత్తాత్రేయ అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి లోని వివిధ వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరాలని ఆకాంక్షించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సతో పాటు ధైర్యం, మనోబలం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.

జన్మదిన వేడుకలను ఆడంబరంగా నిర్వహించడం కంటే సమాజంలోని అవసరమైన వారికి సేవ చేయడం ద్వారా కలిగే ఆనందం, సంతృప్తి ఎంతో గొప్పదని దత్తాత్రేయ అన్నారు. సమాజంలో మానవతా విలువలు మరింత పెంపొందాలని, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ రామాంజనేయులు, వైద్యులు, ఇతర సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు మూల్యాంకనంపై హైకోర్టుకు లేఖ

**రివాల్యుయేషన్‌లో పాస్ అయిన విద్యార్థులకు ఫీజు రిఫండ్ చేయాలి**

**యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు**



సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యా బోర్డులు, విశ్వవిద్యాలయాల్లో పరీక్షల మూల్యాంకనంలో జరుగుతున్న లోపాలపై భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ఈమెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ఎల్ఎల్బీ లేబర్ లా--1 పరీక్షలో సుమారు 1,500 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా, రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న దాదాపు 1,000 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం మూల్యాంకన వ్యవస్థలోని తీవ్రమైన లోపాలను బయటపెడుతోందని ఆయన పేర్కొన్నారు. పేపర్లు దిద్దేవారి నిర్లక్ష్యానికి విద్యార్థులు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించిన మధు, రీవాల్యుయేషన్‌లో మార్కులు పెరిగిన లేదా పాస్ అయిన విద్యార్థులకు చెల్లించిన ఫీజును సంబంధిత బోర్డు లేదా విశ్వవిద్యాలయం 30 రోజుల్లోగా పూర్తిగా తిరిగి చెల్లించేలా హైకోర్టు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రీవాల్యుయేషన్ ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని, ఇది రాజ్యాంగంలోని సమానత్వ హక్కుకు విరుద్ధమని పేర్కొన్నారు. మొదటిసారి మూల్యాంకనంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధ్యాపకులు, కన్సల్టెంట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంపొందించేందుకు హైకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా లేదా ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విద్యార్థులకు న్యాయం చేయాలని చంద్లాపురం మధు విజ్ఞప్తి చేశారు.

## ఫీజు రియంబర్స్మెంట్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

**ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయం ముట్టడిస్తాం**

**జీవో 7 రద్దు, 8, 9 జీవో వల్ల విద్యార్థుల జీవితాలు పెనంపై నుండి పోయిల పడ్డట్టే**

**బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్**



సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రోజుకొక కొత్త జీవో తీసుకొస్తూ విద్యార్థులను గంధరగోల పరుస్తున్నారని, ఫీజులు రియంబర్స్మెంట్ పై తక్షణమే ప్రభుత్వం స్పందించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం జీవో నం. 7 ను రద్దుచేసి జీవో 8, 9 లను తీసుకొచ్చిందని, ఈ జీవోల వల్ల విద్యార్థులకు కించెత్తు ప్రయోజనమైనా లేకపోగా బీసీ విద్యార్థుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందన్నారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని ఎలాగైతే సంపూర్ణంగా అమలు చేశారో ఆ పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలని బీసీ సమాజం డిమాండ్ చేస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యహరిస్తు రాష్ట్రంలోని 14 లక్షల మంది పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని తీవ్రంగా మండిపడ్డారు. గత నాలుగు సంవత్సరాల బకాయిలు విడుదల చేయని చేతకాని ప్రభుత్వం, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మాత్రం భవిష్యత్తులో ఫీ రియంబర్స్మెంట్ నిధులు విద్యార్థుల ఖాతాలోనే జమ చేస్తామనడం హాస్పద్యధంగా ఉందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై కౌన్సిలింగ్ తేదీలు ప్రకటించినప్పటికీ, ఫీజుల రియంబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వం ఇంకా గందరగోళ పరిస్థితులు సృష్టిస్తుందని అన్నారు. ర్యాంకు నిబంధన లేకుండా మొత్తం ఫీజులను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, జాప్యం చేయకుండా ఫీజుల బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో రెండు మూడు రోజుల్లోనే వేలాదిమంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



## ఓయూ హెచ్ సి డి సి ట్రైనింగ్ సెంటర్ ద్వారా 243 విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

**ఉద్యోగ మేళాలో పాల్గొన్నా 20 కంపెనీలు : ఓయూ వీసీ**

సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ (హెచ్ సి డి సి) విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పనిచేస్తుందని ఓయూ విసి ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఓయూ సి ఎఫ్ ఆర్ డి బిల్డింగ్ లో శుక్రవారం నిర్వహించిన ప్లేస్మెంట్ సక్సెస్ మీట్ కు ముఖ్యఅతిథిగా ఓయూ విసి హాజరై హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా క్యాంపస్ ప్లేస్మెంట్లో ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులందరికీ నియామక పత్రాలు అందించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ ను గత సంవత్సరం నుండి హెచ్ సి డి సి డైరెక్టర్ ప్రో.విజయ చరణ్, జెయింట్ డైరెక్టర్ లు కలిసి చాలా విజయవంతంగా కోర్సులను డిజైన్ చేసి వివిధ అంశాలపై వారం రోజుల పాటు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించారన్నారు. ఈ ట్రైనింగ్ ల వల్ల విద్యార్థులకు చాలా లబ్ధి చేకూరిందనీ, ఫిజిక్స్ , కెమిస్ట్రీ, అర్థమెటిక్స్, కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ ల నుండి విద్యార్థులు రావడం జరిగిందనీ,వారికి అన్ని రకాలుగా ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. సుమారు 20 కంపెనీల కు నాలుగు లక్షల ప్యాకేజీ తో 243 మంది విద్యార్థులు సెలెక్ట్ అయ్యారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్, మిగతా ప్రొఫెషనల్ కోర్సులే కాకుండా సైన్సు సబ్జెక్ట్, కామర్స్ సబ్జెక్ట్ లలో కూడా విద్యార్థులు ప్రతిభావంతులుగా ఉన్నారు. వారందరికీ కూడా ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగ అవకాశాలను కల్పించిందనీ, విద్యార్థులకు మంచి ట్రైనింగ్ ను అందించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా ముఖ్య ఉద్దేశన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్లేస్మెంట్ సెల్ ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. హెచ్ సి డి సి డైరెక్టర్ విజయచరణ్ వారి బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి డి సి ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మూసాపేట్ గౌడ సంఘం నుంచి రూ.10 లక్షల విరాళం

కూకట్‌పల్లి, జూన్ 11(వాయిస్ టుడే): మూసాపేట్ గడిగుట్ట మైసమ్మ దేవాలయం సమీపంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి మూసాపేట్ గౌడ సంఘం తరపున రూ.10,00,000 (పది లక్షలు) విరాళం అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంలో భాగంగా, ఈ రోజు మొదటి విడతగా రూ.5,00,000 (ఐదు లక్షలు)లను గుడి కమిటీ సభ్యులు చైర్మన్ ఐలయ్య, కేబుల్ శీను, బిక్షపతి,రామచంద్ర సింగ్ కి అందజేశారు. మిగిలిన రూ.5,00,000లను ఈ నెల 30వ తేదీలోపు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ శ్రీ నల్ల పోచమ్మ గుడి చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అంజి గౌడ్, వెంకటేష్ గౌడ్, అనంతయ్య గౌడ్, రాచమల్ల శేఖర్ గౌడ్, గుడికాడ శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి రవిగౌడ్, బాలరాజు గౌడ్, పాండు ముదిరాజ్, నర్సింగ్, ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ఇప్పటివరకు తమ వంతు సహాయం అందించిన ప్రతి దాతకు మూసాపేట్ గౌడ సంఘం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. అలాగే, ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరించాలని మనస్ఫూర్తిగా కోరింది.

## మున్నూరుకాపు హాస్టల్‌లో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులకు ప్రవేశాలు

### ఈవో సత్య చంద్రారెడ్డికి న్యాయవాదుల సంఘం కృతజ్ఞతలు

హైదరాబాద్ : జూన్ 11(వాయిస్ టుడే): కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం (హాస్టల్)లో న్యాయ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించాలని మున్నూరుకాపు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు వినోద్ కుమార్ విజ్ఞప్తి చేయగా, హాస్టల్ కార్యనిర్వాహణ అధికారి (ఈవో) ఎం. సత్య చంద్రారెడ్డి సానుకూలంగా స్పందించి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎం. సత్య చంద్రారెడ్డి మాట్లాడుతూ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులు తమ కళాశాల బోనఫైడ్ సర్టిఫికెట్, గత విద్యా సంవత్సరపు మార్కుల మెమోలు మరియు ఇతర అవసరమైన పత్రాలతో హాస్టల్ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకుంటే ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. అడ్మిషన్ దరఖాస్తు ఫారాలు ఈ నెల 13వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాచిగూడలోని మున్నూరుకాపు హాస్టల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులకు హాస్టల్‌లో ప్రవేశాలు కల్పించాలన్న తమ విజ్ఞప్తిని వెంటనే ఆమోదించిన హాస్టల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం. సత్య చంద్రారెడ్డికి మున్నూరుకాపు న్యాయవాదుల సంఘం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.



# ఖమ్మం మైనర్ బాలిక ఘటనలో నిందితున్ని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా కఠినంగా శిక్షించాలి

## బాలికకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలి

## కుటుంబానికి భద్రత కల్పించి, ఆర్థిక సహాయం అందించాలి

## ప్రజాసంఘాలు...




సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ఖమ్మంలో మైనర్ బాలికపై ఆత్యాచారం, ఆపై హత్యయత్నం చేసిన నిందితుడు గౌస్ పాషాను ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా కఠినంగా శిక్షించాలని పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య పార్క్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.ఆబ్బాస్, గిరిజనసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్, రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర నాయకులు మిర్యాల గోపాల్ లు పాల్గొని మాట్లాడారు. బాలికకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని, బాలిక కుటుంబానికి భద్రత కల్పించి, ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. రాష్ట్రంలో వరసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, అమ్మాయిలకు, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా నిందితుడు గౌస్ పాషా ను కఠినంగా శిక్షించేందుకు తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలిక నిమ్స్ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉందని, ప్రభుత్వం మెరుగైన నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, కుటుంబానికి భద్రత కల్పించికోటి రూపాయల ఆర్థిక సహకారం ప్రభుత్వం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అమ్మాయిలకు మహిళలకు రక్షణ కల్పించడానికి చర్యలు చేపట్టాలని, నిందితులకు కఠినంగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం తెలంగాణ రాష్ట్రం మహిళ కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయ లక్ష్మి కి మెమోరాండం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్,నాయకులు కృష్ణ నాయక్, శశి కళ, కవిత, రజిత, సంగీత,సోమయ్య, నరేష్, వెంకన్న,కనకయ్య కవిత, ఎం జ్యోతి, పి ఎల్లమ్మ, రజిత, ఇందిరా, ప్రేమ, జోషిలా, సంగీత, బ్రాహ్మణి పాల్గొన్నారు.




## గిరిజన అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం: దీపక్ ఖండేకర్

సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): గిరిజన సమాజాల అభ్యున్నతి, సమ్మిళిత అభివృద్ధి మరియు వారి సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మధ్యప్రదేశ్ గవర్నర్ సలహాదారు దీపక్ ఖండేకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లోని రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సెమినార్ హాల్‌లో "గిరిజన సంస్కృతి మరియు జీవనం: గతం, వర్తమానం మరియు భవిష్యత్తు" అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, అభివృద్ధి సంబంధిత సవాళ్లు దాదాపు ఒకే విధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సదస్సులు విధానపరమైన చర్చలకు, సమిష్టి కార్యాచరణకు మరియు సార్థక జోక్యాలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ, గిరిజన సమాజాల అభ్యున్నతికి విశ్వవిద్యాలయం పలు పరిశోధనలు, కమ్యూనిటీ హెల్త్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ కె. శ్యామ్ ప్రసాద్ 35 గిరిజన తెగల సామాజిక-సాంస్కృతిక జీవన విధానాలపై ప్రసంగించారు. ప్రముఖ పండితులు ప్రొఫెసర్ పొలిగొండ సుబ్బాయ చారి గిరిజన సంస్కృతి, సాహిత్యం, అభివృద్ధి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. డాక్టర్ ఎం. ప్రభాకర్, ఐఆర్ఎస్ ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఈ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం జూన్ 13 సాయంత్రం 4:30 గంటలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొ. జి. రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## 'ఆపరేషన్ నన్హే ఫరిస్తే'లో 512 మంది చిన్నారుల రక్షణ

### దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్‌కు జీఎం అభినందనలు




సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నిర్వహిస్తున్న 'ఆపరేషన్ నన్హే ఫరిస్తే' కార్యక్రమం ద్వారా 2026 జనవరి నుంచి మే నెలల మధ్య 512 మంది చిన్నారులను విజయవంతంగా రక్షించినట్లు అధికారులు తెలిపారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో అసురక్షిత పరిస్థితుల్లో గుర్తించిన చిన్నారుల్లో 421 మంది బాలురు, 91 మంది బాలికలు ఉన్నారు. వీరిని సురక్షితంగా రక్షించి తదుపరి సంరక్షణ కోసం బాల సంక్షేమ కమిటీలకు అప్పగించినట్లు వెల్లడించారు. ఇంటి నుంచి పారిపోయిన, తప్పిపోయిన లేదా ఆపదలో ఉన్న చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలతో తిరిగి కలిపే ప్రక్రియలో ఆర్‌పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో 2025 సంవత్సరంలో 1,622 మంది, 2024లో 1,390 మంది చిన్నారులను కూడా రక్షించినట్లు అధికారులు పేర్కొన్నారు. 'ఆపరేషన్ నన్హే ఫరిస్తే'లో భాగంగా ఆర్‌పీఎఫ్ బృందాలు రైల్వే స్టేషన్లు, రైళ్లలో నిరంతర నిఘా నిర్వహిస్తూ ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తిస్తున్నాయి. పిల్లల రక్షణ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ తక్షణ సహాయం, పునరావాస చర్యలు చేపడుతున్నాయి. అలాగే చిన్నారులలోని ఆందోళన, అసురక్షిత పరిస్థితులను గుర్తించేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రధాన మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆర్‌పీఎఫ్ బృందాన్ని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే అంకితభావం, అప్రమత్తతతో సేవలు కొనసాగించాలని సూచించారు. రైల్వే స్టేషన్లు లేదా రైళ్లలో ఒంటరిగా కనిపించే లేదా అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గమనిస్తే వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కు సమాచారం అందించాలని ఆయన ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

# డీజిల్ పొదుపుపై ఉద్యోగుల్లో సామాజిక బాధ్యత పెరగాలి

## డీజిల్ ఆదా కోసం సాంకేతిక పద్ధతులతో మైలేజీ పెంపు

## టీజిఎస్ ఆర్టిసి ఎండీ వై. నాగిరెడ్డి




సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, నిరంతరం పెరుగుతున్న డీజిల్ ధరల నేపథ్యంలో సంస్థపై పడుతున్న భారీ నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ 'బస్ భవన్'లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో "డీజిల్ నిర్వహణ -- అవగాహన సదస్సు" నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇది రవాణా రంగంపై, ముఖ్యంగా ఆర్టీసీపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా అధిగమించాలంటే డీజిల్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, ప్రతి లీటరు ఇంధనాన్ని పొదుపుగా వాడుతూ వృథాను అరికట్టడం ఒక్కటే సరైన మార్గమని స్పష్టం చేశారు. ఇందుకోసం డిపోల స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఉత్తమ నిర్వహణ పద్ధతులను నిరంతరం అలవర్చుకోవాలని అధికారులకు, సాంకేతిక సిబ్బందికి సూచించారు. కేవలం ఇదొక విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగికి ఇంధన పొదుపుపై ఒక సామాజిక బాధ్యత ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డీజిల్‌ను ఆదా చేయడం ద్వారా సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా మన వంతు సహకారం అందించినవారమవుతామని పేర్కొన్నారు. ఈడీ సిహెచ్.వెంకన్న, ఫైనాన్సియల్ అడ్వైజర్ విజయపుష్ప, బీపీసీఎల్ ( I & C) తెలంగాణ హెడ్ లక్ష్మీ లాల్ చౌహాన్ , మార్కెటింగ్ మేనేజర్ రఘునాథరావ్, ఆర్టీసీ సీసీఎస్ ప్రభులత, పలువురు డిప్యూటీ ఆర్‌ఎం లు, డిపో మేనేజర్లు పాల్గొని డెపోలలో ని గ్రౌండ్ ట్యాంక్ ల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. బస్సుల డీజిల్ మైలేజీని (కే ఎం పి ఎల్) గణనీయంగా పెంచడానికి, గ్యారేజ్ పరిధిలో సాంకేతిక లోపాలను సకాలంలో గుర్తించి నివారించడానికి తీసుకోవాల్సిన వివిధ రకాల జాగ్రత్తలపై నిపుణులు సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.



## డ్రై డే కార్యక్రమంలో కలెక్టర్

### డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే) : శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 7వ వార్డులో నిర్వహించిన "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతి వారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అని అన్నారు. ఇళ్లలోని నీటి ట్యాంకులు, పాత డబ్బాలు, పాత్రలు వంటి వాటిలో నిల్వ ఉండే నీటిని పూర్తిగా తొలగించి శుభ్రపరచాలని సూచించారు. అలాగే కూలర్లను తరచుగా శుభ్రం చేయడం, కొబ్బరి చెక్కలు, పాత టైర్లు వంటి వ్యర్థాలను తొలగించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. ప్రతి కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాధికి కారణమయ్యే దోమలు శుభ్రమైన నిల్వ నీటిలోనే పెరుగుతాయని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాలనీలలో ఉన్న ఓపెన్ డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులకు సూచించారు.దోమల నివారణ చర్యలను నిరంతరం కొనసాగించాలని చెప్పారు.అనంతరం కాలనీలో అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, మున్సిపల్ సిబ్బందితో వీలైనంత త్వరగా డ్రైనేజీ వ్యవస్థ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.




## యాదగిరిగుట్టలో ఘనంగా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 సమారోప కార్యక్రమం

యాదగిరిగుట్ట (వాయిస్ టుడే) : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని సౌభాగ్య రిసార్ట్‌లో భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 సమారోప కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అల్లేటి మహేశ్వర్ రెడ్డి మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల పాత్ర, ప్రజాసేవలో పార్టీ బాధ్యతలపై నాయకులు, కార్యకర్తలకు సమగ్ర మార్గనిర్దేశనం చేశారు. దేశ నిర్మాణంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలంగా ఎదుగుతోందని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ 4 నుండి 5 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) జరిగితే బీజేపీ మరింత ఎక్కువ స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ శిక్షణా మహాభియాన్ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, నాయకత్వ లక్షణాలు, సమాజ సేవా దృక్పథంపై కార్యకర్తలకు అవగాహన కల్పించబడిందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మీూా శానంపూడి సైదిరెడ్డి గోలి మధుసూదన్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు గంగిడి మనోహర్ రెడ్డి గారు, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి గారు, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనూరు వీరారెడ్డి , దూడల బిక్షం పార్టీ జిల్లా, మండల, మోర్చా నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్12: నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో స్వర్గస్తులైన వారి బాధిత కుటుంబాలను ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి ఈ తెలుసుకున్నారు. వారి కుటుంబాలకు ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్వాత్ గ్రామ స్తులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## పేదలకు అండగా ప్రభుత్వం 40 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన శ్రీహరిరావు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: నిర్మల్ జిల్లా, శుక్రవారం నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ లికూచాడి శ్రీహరిరావులి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది లబ్ధిదారులకు 10 లక్షల 40 వేలవిలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక ఇబ్బందులు, వైద్య చికిత్సలు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా లిశ్రీహరిరావులి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు చెక్కులు అందుకున్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి, అలాగే తమ సమస్యలను గుర్తించి సహాయం అందించిన లికూచాడి శ్రీహరిరావుకులి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పాండవ పూర్ గ్రామ ఉపసర్పంచ్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వార్డ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే**

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరో ముందడుగు ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో గౌరవ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే శ్రీ వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో కడెం మండలం పాండవపూర్ గ్రామం ఈ రోజు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఉపసర్పంచ్ గొర్రె మధు, వార్డు సభ్యులు బండి సురేష్, శేఖర్, వంశీ, అజయ్, శివ, హరీష్, శరన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ శ్రీ పడిగేల భూషన్ , జిల్లా ఆర్టీఏ సభ్యులు శ్రీ తుమ్మల మల్లేష్ యాదవ్ , పార్టీ అధ్యక్షులు శ్రీ బొడ్డు గంగన్న సర్పంచ్ శ్రీమతి ఆడే విజయ , ఉత్తర్ దికొండ విజయ్ ఇదుల తిరుపతి టీ. రమేష్ భూమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## మహిళల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలి

**ఐద్వా (AIDWA) డిమాండ్**

ముదిగొండ మండలం జూన్ 12 (వాయిస్ టుడే): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ముదిగొండ మండల ఐద్వా ప్రతినిధులు శుక్రవారం స్థానిక తహసిల్దార్ రవి కుమార్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పద్మ,కోలేటి అరుణ మాట్లాడుతూ, ప్రస్తుతం మహిళలపై అణిచివేత, హింస, దాడులు పెరిగిపోతున్నాయని, ఆర్థికంగా మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం సరైన రక్షణ మరియు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు; కాబట్టి ప్రభుత్వం స్పందించి రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని, ప్రతి మహిళకు నెలకు రూ 2500 ఆర్థిక సహాయం అందించాలని, విపరీతంగా పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని మరియు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించిన ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు కె. అరుణ, పి. పద్మావతి,కనపర్తి అనూష,మల్ల విక్టోరియా,సిహెచ్. పార్వతి, బి. భద్రమ్మ, ఆర్. రేణుక, ఎ. ఉమ, టి. సంక్రాంతి, వి. శైలజ, కె. సీతారాములు, ఎమ్. నవీన తదితరులు పాల్గొన్నారు.

# అదిక పీజులు వసూలుచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**విద్యాహక్కు చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి!**

**అద్వకేట్ జగన్ మోహన్ అద్యక్షులు, బిఎస్పీ నిర్మల్ జిల్లా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: నిర్మల్ జిల్లా విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతుంది అని అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలపై గుర్తింపు రద్దు చేయాలని ఇందుకు సహకరించిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆమోదించిన ఫీజు వివరాలని నోటీసుబోర్డు పై మరియు వెబ్సైట్లలో పూర్తిగా ప్రదర్శించాలి కాని కొన్ని విద్యా సంస్థలు( కార్పొరేట్ సంస్థలు కూడా) పాటించక పోవడం దారుణం అని,పేద బలహీనవర్గాల ప్రజలపై అధికంగా అడ్డగోలుగా ఇబ్బందులు గురి చేయడం అన్యాయమని అన్నారు,నిర్మల్ జిల్లాలో కూడా కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు అదిక పీజులు వసూలు చేస్తున్నారని,పుస్తకాలు బహిరంగంగా బ్లాక్ మార్కెటింగ్ చేయడం చూస్తుంటే ప్రభుత్వం పాలన గాలికి వదిలేశారు అని జగన్ మోహన్ విమర్శించారు.

**భారీగా పెరుగుతున్న ఫీజులు - కొన్ని ఉదాహరణలు:**

**హైదరాబాద్‌లో:** గ్రేటర్ హైదరాబాద్ ఉప్పల్‌లోని ఒక స్కూల్‌లో ఫీజును రూ 76 వేల నుండి ఏకంగా రూ లక్షకు (40% శాతం) పెంచారు. మరో స్కూల్‌లో నర్సరీ ఫీజే రూ. 71,800 కాగా, పైతరగతులకు రూ 1.25 లక్షలుగా ఉంది.

ఇంటర్నేషనల్ స్కూల్స్ అంతర్జాతీయ పాఠశాలల్లో నర్సరీ ఫీజులే రూ. 2.51 లక్షలు దాటాయి సీబీఎస్ఈ స్కూళ్లలో ఏడాదికి రూ. 2.61 లక్షల నుండి రూ. 4.91 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

కార్పొరేట్ స్కూల్స్ ఖమ్మంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో గత ఏడాది 8వ తరగతికి రూ. 42 వేలు ఉండగా,ఈ ఏడాది రూ. 15 వేలు పెంచి రూ. 56 వేలకు చేర్చారు.

**యూనిఫాం, పుస్తకాలు:** ఒక పాఠశాలలో గత ఏడాది రెండు జతల యూనిఫాంకు రూ. 4,800 తీసుకోగా, ఈ ఏడాది రూ. 6,800కు పెంచారు. పుస్తకాలు, నోట్‌బుక్స్ కోసం అదనంగా రూ. 8 వేల నుండి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు.

పక్క రాష్ట్రాల (తమిళనాడు) ఫీజుల నియంత్రణ విధానం: తమిళనాడు ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని అమలు చేస్తోంది అని తెలంగాణ ప్రభుత్వం కూడా అదిక పీజులు నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణలో 'ఫీజు నియంత్రణ చట్టం' ఏమైంది?**

రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తెస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, అదింకా అమలుకు నోచుకోలేదు ఎందుకు అని ప్రశ్నించారు,వెంటనే పీజులు నియంత్రణ చేయాలని విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అడ్వకేట్ జగన్ మోహన్, చింతకుంట రాజేశ్వర్, చెరుకు రాజ్యం, లక్ష్మియాదవ్, పడిగెల రాజేష్, కాటంప్రభాకర్ క్లైమేట్ వెస్లీ,ప్యారమూర్ సాగర్, అబ్బాన్‌లు పాల్గొన్నారు.



## ముదిగొండలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

**బాధితురాలికి తక్షణ సాయం అందిస్తామని హామీ**

ముదిగొండ మండలం జూన్ 12 వాయిస్ టుడే: ముదిగొండ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో అర్ధరాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అంతోటి మరియమ్మ అనే మహిళకు చెందిన గుడిసె పూర్తిగా కాలి బూడిదైంది. రాత్రి ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ లైన్ మెన్ సుధాకర్ అర్ధరాత్రి సమయంలో కూడా తక్షణమే స్పందించి, విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సీపీఎం నాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ఉదయాన్నే బాధితురాలి ఇంటికి చేరుకుని ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ... ఈ ప్రమాద విషయాన్ని వెంటనే రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం తరపున బాధితురాలికి తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, సర్పంచ్ కట్టకూరి ఉపేందర్, వార్డు సభ్యులు, సీపీఎం పార్టీ బృందం తదితరులు పాల్గొన్నారు.



## రేపు నిర్మల్‌లో ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవం ముఖ్య అతిథిగా శ్రీహరిరావు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరి రావ్ గారి మాతృమూర్తి పితృదేవులు స్వర్గీయ కుచాడి సత్యమ్మ ప్రకాష్ రావ్ గారల సంస్మరణ లో నిర్మల్ పట్టణం ఖానాపూర్ రోడ్ లోని మారేమ్మ దేవస్థానం ఎదురుగ దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న, లక్షలాది అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించిన రాజ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రి ని శనివారం ప్రారంభించేందుకు సిద్దమైంది. రాష్ట్ర అబ్కారి మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావ్ గారు శనివారం ఉదయం 10 గంటలకు ఈ ఆసుపత్రి ని ప్రారంభిస్తారు. నిపుణులయినా కంటి డాక్టర్ లు సిబ్బందిచె ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ అసుపత్రి కొనసాగుతుందని, కంటి రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించబడ్తాయని, అవసరమైన వ్యక్తులకు ఆపరేషన్ లకు రెఫెర్ చేయడం జరుగుతుందని తెలియజేసారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మిత్రులు,ఆప్తులు శ్రేయోభిలాషులు, పురప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు , సర్పంచ్ లు ఎంపీటీసీలు కార్యకర్తలు, అభిమానులు హాజరు కాగలరు.

## నిర్మల్ పట్టణంలో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏ డీ ఈ



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: నిర్మల్ జిల్లా ఆదర్శనగర్ సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనులు దృశ్య శనివారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏ డి ఈ కొమ్మెర శ్రీనివాస్ రావు తెలిపారు. పట్టణంలోని ఈద్గాం భాగ్యనగర్ మౌలానా ఆజాద్ నగర్ సిద్ధాపూర్ ఆదర్శనగర్ రామ్ నగర్ ఆసరా కాలనీ మదిన కాలనీలో సరఫరా నిలిపి చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## యూరియా విక్రయాలపై నిర్మల్ కలెక్టర్ హెచ్చరిక



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూన్ 12: నిర్మల్ జిల్లా అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు యూరియా వాడకం నిర్ణీత ధర సంబంధించిన పోస్టర్ వారు ఆవిష్కరించారు. ప్రతి ఫర్టిలైజర్ షాప్ ముందు విధిగా ఈ పోస్టర్ ఉండాలని వారు సంబంధిత యజమానులకు సూచించారు. నిబంధనలో ఉల్లగించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఫర్టిలైజర్ షాప్ యజమానులు వివిధ అధికారులు పాల్గొన్నారు.




## నిర్మల్ ఎస్ బి ఐ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: నిర్మల్ జిల్లా ఎస్ బీ ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమం ప్రజలకు ఆన్లైన్ మోసాలు డిజిటల్ లావాదేవీల భద్రతలపై అవగాహన కల్పించారు. ఎల్ డి ఎం సి వేణుగోపాల్ చీఫ్ మేనేజర్ అశోక్ శ్రీనివాస్ ప్రసంగించారు. అనుమానస్పద లింకులు ఓ బ్యాంక్ వివరాలను ఎవరికి చెప్పకూడదని మోసపోతే వెంటనే 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాల్ చీఫ్ మేనేజర్ అశోక్ శ్రీనివాస్ ఎస్ బీ ఐ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్ పి ఎఫ్ ఆధ్వర్యంలో 5 కే రన్

నాగార్జునసాగర్, జూన్, 12: వాయిస్ టుడే : నాగార్జునసాగర్ ఎస్ పి ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం 5 కె రన్ ను నిర్వహించినట్లుగా ఎస్ పి ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి. రాజు తెలిపారు. ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతిలక్రా, జోన్ డి ఐ జి మాధవరావు సూచనలు మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా పైలాన్ కాలనీ పిల్లర్ నుండి డౌన్ పార్క్ వరకు 5కే రన్ ను నిర్వహించామన్నారు. దీనితోపాటు ఫిజికల్ ఫిట్నెస్ కోసం యోగాసనాలు, ఎక్సర్సైజులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎఫ్ సాగర్ డ్యాం ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, జెన్కో ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ నాయుడు,ఎస్ ఐ లు వెంకటేశ్వర్లు, రఘు, ఏ ఎస్ ఐ లు అహ్మద్, యూసుఫ్,పుల్లయ్య, రవీందర్, జెన్కో, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాయంపేట మండలంలో మక్కల కొనుగోలులో భారీ మోసం

## – 70 లక్షల వరకు ౧ రైతుల నుండి అక్రమ వసూళ్లు

## – ప్రాథమిక సహకార సంఘంపై విచారణ చేపట్టాలి



శాయంపేట (వాయిస్ టుడే): మండలంలో ఇటీవల ప్రాథమిక సహకార సంఘం పర్యవేక్షణలో నిర్వహించిన మక్కల కొనుగోలు కేంద్రంలో భారీ అవినీతి జరిగింది. ఖరీఫ్ సీజన్ మొదటి దశలో వేసిన పత్తి పంటపై వర్షాల ప్రభావం అధికంగా ఉండటం వలన రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూసారు. ముఖ్యంగా కౌలు రైతులకు కోలుకోలేని దెబ్బపడి తీవ్రంగా నష్టపోయారు. తద్వారా రెండవ పంట వేసే క్రమంలో రైతులు మండల వ్యాప్తంగా చాలా ఎకరాలలో మొక్క జొన్న సాగుకు మొగ్గుచూపారు. రేయి పగలు కష్టపడి పండించిన పంట పై అధిక దిగుబడులు సాధించారు. అనుకున్నదే తడువుగా ప్రభుత్వం కూడా రైతన్నలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి సహకార సంఘాల కొనుగోలు కేంద్రాల ద్వారా మార్క్ ఫెడ్ మద్దతు ధర 2400 చొప్పున క్వింటాలుకు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుని శాయంపేట మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.కానీ నిబంధనలకు విరుద్ధంగా ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు వ్యవహరించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి సరైన సంఖ్యలో గన్ని బ్యాగులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాభావ పరిస్థితుల్లో భయపడిన రైతన్న అధిక డబ్బులు వెచ్చించి ప్రైవేటుగా గన్ని బ్యాగులు కొనుగోలు చేసి మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాల నుంచి కేంద్రానికి ట్రాక్టర్ లలో కిరాయి పెట్టుకుని వచ్చిన రైతన్నకు అడుగడుగున నిరాశే ఎదురైంది. దాదాపు 60 లక్షల నుండి 70 లక్షల వరకు దండుకున్నారు

కొనుగోలు కేంద్రంలో ఎప్పటికపుడు సత్వరమే కాంటాలు నిర్వహించాలి , కాంటా అయిన తర్వాత బస్తాల పూర్తి బాధ్యత కొనుగోలు కేంద్రాలదే అన్న ప్రభుత్వ నిబంధనలను విస్మరిస్తూ రైతుల ధాన్యాన్ని తూకం వేయడానికి వారం రోజులు ఆలస్యం చేసిన తర్వాత బస్తాలు లారీలో ఎగుమతి కావాలంటే హమాలీ ఛార్జీలు 60 నుండి 65 రూపాయలే కాకుండా ఒక్కో 51 కేజీ బస్తాకు 30 రూపాయలు అదనంగా డబ్బులు చెల్లించిన రైతు ధాన్యం మాత్రమే ఎగుమతి చేయాలని,లేనిచో కాంటా అయిన కూడా ఆ బస్తాలకు కొనుగోలు కేంద్రానికి సంబంధం లేదని పూర్తి బాధ్యత రైతే తీసుకోవాలని దురుసుగా ప్రవర్తించారు. హన్మకొండ జిల్లాలో అత్యధికంగా 2 లక్షలకు పైగా బస్తాలు రైతుల నుండి కొనుగోలు చేసి ఒక్కో బస్తాకు 30 రూపాయల చొప్పున అక్రమంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వం ప్రత్యేకంగా ఇచ్చే మద్దతు ధర లభిస్తుందని ఆశపడ్డ రైతన్న ను మోసం చేశారు కేంద్ర నిర్వాహకులు,కావున ప్రభుత్వం మరియు జిల్లా , రాష్ట్ర మార్క్ ఫెడ్ అధికారులు స్పందించి శాయంపేట ప్రాథమిక సహకార సంఘం పర్యవేక్షణలో నిర్వహించిన కొనుగోలు కేంద్రం పై విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య

### ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి

మాడ్గులపల్లి, జూన్ 12 (వాయిస్ టుడే): పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం లో విశాలమైన తరగతి గదులు, ప్రాంగణంతో కూడిన ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అర్హత అనుభవం అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో ఉచిత నాణ్యమైనవిద్యను అందించడం జరుగుతుందని తోపుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి తెలిపారు. మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయ బృందం ఇంగ్లీష్ మీడియం లో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు రెండు జతల ఏకరూప దుస్తులతో పాటు సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన ఫర్నిచర్ విడివిడిగా పరిశుభ్రమైన వ్యక్తిగత మరుగుదొడ్లు డిజిటల్ బోర్డులతో డిజిటల్ విద్యా బోధన కంప్యూటర్ విద్య సైన్స్ ల్యాబ్ క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు ప్రతినెల క్విజ్ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం ప్రత్యేకతలను నిర్వహించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి లక్షలాది ఫీజులు కట్టి అప్పుల పాలు కాకుండా తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి,రాంబాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్,సాయికుమార్,స్వాతి, లతో పాటు గ్రామస్తులు షేక్ గూడుబీ, షేక్ లతీఫ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



## సొంత ఊరికి కొంత కొంతమేలు

### ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించిన కామునిపల్లి చంద్రశేఖర్ రెడ్డి

మహబూబ్నగర్ జిల్లా జూన్ 12 (వాయిస్ టుడే) : (జడ్చర్ల )నవాబుపేట్ మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కామునిపల్లి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు.శు క్రవారం గ్రామంలో ఈ శిబిరాన్ని ప్రారంభించారు.యశోద ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది కలిసి 500లమందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ పాత్రికేయులు నజీబ్ ఖాద్రీ,నాయకులు లక్ష్మయ్య,రామచంద్రయ్య, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలికపై దారుణ ఘటనపై బీఆర్ఎస్ మైనార్టీ నాయకుల ఆగ్రహం

### నిందితుడికి కఠిన శిక్ష విధించాలి: ఎస్.కె. ఖాసిం




వైరా (వాయిస్ టుడే) : ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటనపై బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ మండల నాయకుడు ఎస్.కె. ఖాసిం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులపై జరుగుతున్న ఇలాంటి అమానుష ఘటనలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలికపై జరిగిన ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆయన, నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకుండా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుడు ఏ రాజకీయ పార్టీకి చెందినవాడైనా, ఎంతటి ప్రభావశీలుడైనా చట్టం ముందు సమానమేనని, తప్పు చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు.

బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు, పూర్తి భద్రత కల్పించడంతో పాటు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేసు దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేస్తూ, నిందితుడికి ఆదర్శప్రాయమైన శిక్ష విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్.కె. ఖాసిం డిమాండ్ చేశారు.

## సాగర్ సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ ల బృందం




నాగార్జునసాగర్, జూన్, 12: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ ను శు క్రవారం ట్రైనీ ఐఏఎస్ల బృందం సందర్శించింది. తెలంగాణ దర్శన్లో భాగంగా నాగార్జునసాగర్లోని తెలంగాణ టూరిజం విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న ఈ బృందానికి మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ ను, బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యానవనం,స్తూపవనాలను సందర్శించి మహాస్థూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. మహాస్తూపం లోని ధ్యాన మందిరంలో వీరిచే బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన బుద్ధ జ్యోతులను వెలిగింపజేపించి బుద్ధవనం కండువాలతో, బ్రోచర్లతో సత్కరించారు. 2025 బ్యాచ్కు సంబంధించిన ఐఏఎస్ అధికారులు శ్రీకాంత్ రెడ్డి, సాయి శివాని, పారస్ కుమార్లు తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడ్డారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏప్రిల్ 29 నుండి జూన్ 14వ తేదీ వరకు శిక్షణ పొందుతున్నారు. దీనిలో భాగంగా ఈనెల 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం నాగార్జునసాగర్ ను సందర్శించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరితోపాటు పెద్దవూర తాసిల్దార్ కాసిం, ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి, సాగర్ ఎస్ ఐ సతీష్, సాగర్ డ్యామ్ జె ఇ విజయ్, ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ ఐ రఘు తదితరులు ఉన్నారు.

## శివనగర్ సమస్యలపై మంత్రి కొండ సురేఖకు వినతి పత్రం ఇచ్చిన శ్రీరాం రాజేష్



వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 12 : అండర్ రైల్వేగేట్, శివనగర్ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ నగర కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ రాజేష్ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అటవీ,పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ను కలిసి శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలనుండి అండర్ బ్రిడ్జ్ క్రింద నుండి మురుగునీరు ప్రవహిస్తూ రోడ్డుమీద నిలుస్తున్నావని దీని వల్ల రోడ్డు మీద నుండి నడుచుకుంటు వెళు ్ళ పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా శివనగర్, ఏసి రెడ్డి నగర్, పుప్పాల గుట్ట ప్రాంతవాసులు రోజు కూలి, హమాలి పనులకోసం శివ నగర్ స్టేషన్ వైపు నుండి అవతలికి ప్రక్కకు వెళ్ళడానికి చాలా కష్టం పడుతున్నారని, కావున మంత్రి శివనగర్ రైల్వేస్టేషన్ వైపు నుండి అవతలివైపుకు వెళ్ళడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసి ఈ ప్రాంత వాసుల చిరకాల వాంఛను నెరవేర్చలని అయన కోరారు. వినతి పత్రాన్ని చదివిన మంత్రి సురేఖ స్పందించి నగరపాలక సంస్థ కమిషనర్ కు లెటర్ పంపడంతో పాటు, స్వయంగా ఫోన్ చేసి రాబోయేది వర్షాకాలం, శ్రావణ మాసాలను దృష్టిలో ఉంచుకొని సమస్యలను వెంటనే పరిష్కరించవలసిందిగా అధికారులను మంత్రి కోరారనీ శ్రీరామ్ రాజేష్ తెలిపారు.

## సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగమ అధ్యక్షులుగా కాసాల గ్రామానికి చెందిన బైసాని విజయలక్ష్మి



సంగారెడ్డి ప్రతినిధి (వాయిస్ టుడే) : సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలుగా బైసాని విజయలక్ష్మి ఎన్నికయ్యారు ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినందుకు ఆర్యవైశ్య కుల బాంధవులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు ఆర్యవైశ్య కులాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆమె తెలిపారు కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా వేముల ప్రియ కోశాధికారి గజ ద ఉపాధ్యక్షులుగా అనంత కిషన్ గుప్తా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా మాజీ జిల్లా అధ్యక్షులు మాణిక్యం గుప్తా జూకంటి లక్ష్మణ్ గుప్తా సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## రాంటేక్ గ్రామ అభివృద్ధికి 70 లక్షల నిధులు మంజూరు



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 12: రాంటేక్ గ్రామ అభివృద్ధి కి 70 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్లి తెలియజేశారు.గ్రామం లో సిసి రోడ్ల నిర్మాణం తో పాటు వంతెన డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. గతం లో ఎన్నడు లేని విధంగా అన్ని గ్రామాల్లో పెద్ద మొత్తం లో సి సి. రోడ్లు, డ్రైనేజీ ల నిర్మాణం చేపట్టమని అదే విధంగా గ్రామాల్లో మహిళ సమైక్య భవన నిర్మాణాలు, గ్రామ పంచాయితీ భవన నిర్మాణాలు చేపడుతామన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు రాంటేక్ సర్పంచ్ గంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు మాజీ ఎం.. పి పి. నర్సాగౌడ్, మచ్ క ల్ సర్పంచ్ ఆత్మ స్వరూప్, నాయకులు సాయన్న పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలి

### బిసిఐటియు డిమాండ్ ఖమ్మం,కలెక్టరేట్

ఖమ్మం జిల్లా జూన్ 12 (వాయిస్ టుడే) : గ్రామ పంచాయతీ వర్కర్స్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముందు జరిగిన ధర్నా లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ కు మేనిఫెస్టో ప్రకటించిన విధంగా మొత్తం సిబ్బంది ని, పర్మినెంట్ చేయాలని,కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు గ్రీన్ చానల్ ద్వారా కార్మిక ఖాతాల్లో జమ చేయాలని, పంచాయతీ వర్కర్స్ కు రెండోవ పిఆర్సీ వర్తింప చేయాలని, మల్టిపర్పస్ విధానాన్ని రద్దుచేసి, కేటగిరీల వారీగా వర్కర్స్ నియమించాలని డిమాండ్ చేశారు.పంచాయితీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.డ్యూటిలో చనిపోయిన కార్మికులకు ప్రమాదం భీమా 20 లక్షలు ఇవ్వాలని, కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని , పది లక్షల రూపాయలు ఇన్సూరెన్స్, గ్రాడ్యూటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు, అక్కడ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు, అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీజ, కు,డిపిఓ రాంబాబు కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షులు వంగర ధర్మేంద్ర, జిల్లా నాయకులు పంగా లాలయ్య లక్ష్మి నారాయణ, నరేష్, ధనలక్ష్మి, శ్రీనివాసరావు సత్యం, ఆనందరావు, పాప్య బ్రహ్మం, క్రిష్ణ, చరణ్, ఉపేంద్రమ్మ, లచ్చయ్య, సంగయ్య, బాలనాగమ్మ, మణి కుమారి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు, పి.రవి, మాజీ జడ్పిటిసి సభ్యులు,గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

## గర్రెపల్లిలో ఎక్సైజ్ పోలీసుల ఆకస్మిక దాడులు

### – నాటుసార విక్రయిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్



సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్-12 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నాటుసార విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. శు క్రవారం ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గర్రెపల్లి గ్రామ ంలో సంయుక్త దాడులు నిర్వ హించారు. నాటుసార విక్రయం జరుగుతోందన్న విశ్వస నీయ సమాచారంతో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టి, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పది లీటర్ల నాటుసారతో పాటు గుడుంబా తయారీకి వినియోగించే ఇరవై కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా గుడుంబా తయారీకి సిద్ధం చేసిన సుమారు నాలుగు వందల లీటర్ల బెల్లం పానకాన్ని సంఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు. భవిష్యత్తులో ఎవరైనా గుడుంబా తయారీ, విక్రయం లేదా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ దాడుల్లో తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ బాబా, సుల్తానాబాద్ ఎస్సై చిరంజీవి, కరీంనగర్ అర్బన్, తిమ్మాపూర్, రూరల్ ఎక్సైజ్ సిబ్బందితో పాటు సురేష్, ఆసిఫ్, అనిల్, శ్రీనివాస్, కోటేశ్వర్, చైతన్య, రవి, స్రవంతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
శనివారం 13 జూన్ 2026




## జర్నలిస్టుల పిల్లలకు ఇంటర్మీడియట్ విద్యలో 50% ఫీజు రాయితీ

హన్మకొండ ( వాయిస్ టుడే ) జూన్ 12 : ఇంటర్మీడియట్ చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ జూనియర్ కాలేజీలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రతినిధులు చేసిన అభ్యర్థనకు ప్రభుత్వం స్పందించింది. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అలాగే హనుమకొండ జిల్లా టీఎస్‌జేయూ యూనియన్ అధ్యక్షుడు గణపనేని చంద్రశేఖర్ సమర్పించిన వినతిపత్రాన్ని పరిగణలోకి తీసుకున్న ఇంచార్జి వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఇంటర్మీడియట్ విద్య) మరియు హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ. గోపాల్ , ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీలలో జర్నలిస్టుల పిల్లల చదువులకు ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై హనుమకొండ జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ నాయకత్వానికి మరియు విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.




## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ప్రజల భాగస్వామ్యంతో రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**

వరంగల్ ( వాయిస్ టుడే) జూన్ 12: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలతో శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో అన్ని శాఖల సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారిస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

గ్రామస్థాయిలో వివిధ శాఖల ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచడం ద్వారా నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయితీ డెవలప్మెంట్ ప్లాన్ గ్రామసభ సమావేశాలకు అన్ని శాఖల గ్రామస్థాయి అధికారులు, మహిళలు, యువత, రైతులు మరియు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), వైవీ గణేష్, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కల్పనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) నాగ పద్మజ, సంబంధిత మండలాల ఎంపీడీవోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరు డిఎంగా ప్రసూన లక్ష్మి



తొర్రూరు, జూన్ 12 వాయిస్ టుడే : తొర్రూరు ఆర్టీసీ డిఎం గా కె. ప్రసూన లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డిఎం గా ప్రసూన లక్ష్మీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిఎం గా పనిచేసిన పద్మావతి తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి పిఓగా బదిలీపై వెళ్లారు. నూతన డిఎంకు సహచర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ.... ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తానని, డిపో ఆదాయం పెంచేందుకు సిబ్బంది సహకారం అందించాలని కోరారు. డిమాండ్ ను బట్టి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొర్రూరు డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.



## గుండెపోటుతో పురోహితుడు మృతి

తొర్రూరు, జూన్ 12 వాయిస్ టుడే : తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పురోహితుడు మామిళ్ళపల్లి దేవేంద్ర చారి శుక్రవారం పూజా కార్యక్రమాలు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు బారిన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కూతుర్లు మౌనిక, మనిషా, చంద్రలేఖ ఉన్నారు. మృతుడి అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# పదేళ్లలో మీరు చేసిన అభివృద్ధి చెప్పగలరా?

**అభివృద్ధి చేయలేనోళ్ళు అభివృద్ధి గురించి మాట్లాడటం చాలా హాస్యాస్పదం**

**రెండున్నరేళ్లలో 47వ డివిజన్‌లో 6 కోట్ల పైచిలుకు అభివృద్ధి**

**కాజీపేట గత పాలనలో ఎలా ఉందో ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనిస్తున్నారు**

**పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని**

**47వ డివిజన్‌లో రూ.125 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**



కాజీపేట, జూన్ 12: చేసిన అభివృద్ధి,అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ధైర్యంగా వివరిస్తున్నామని..పదేళ్ల పాలనలో ప్రత్యర్థులు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం 47వ డివిజన్ పరిధిలోని డీజిల్ కాలనీ,ఇంపీరియల్ కాలనీలలో రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ప్రజల మౌలిక అవసరాలను పూర్తిగా విస్మరించారని,అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. అభివృద్ధి చేయలేని వారు,ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే 47వ డివిజన్‌లో రూ.6 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్లు,డ్రైనేజీలు,తాగునీటి సౌకర్యాలు,వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కాజీపేట ప్రాంతం గత పాలనలో ఎలా ఉండేదో, ప్రస్తుతం ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**SIR బూత్ ఏజెంట్ల పక్రియ వేగవంతం చేయాలి**

స్థానిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బూత్ ఏజెంట్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని,ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరూరి సాంబయ్య,నియోజకవర్గ యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,తాజా మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్,విజయశ్రీ రజాలి,సీనియర్ నాయకులు అంకుష్,మనోహర్,డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్,నాయకులు సిరి లారెన్స్,దొంగల కుమార్,తమ్మడి మానస మధు,ఇప్ప శ్రీకాంత్,దువ్వ రాజులు,రేవతి,బర్ల రాజకుమార్, శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి వ్యాఖ్యలను ఖండించిన బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ కాంట్రాక్టర్స్ జేఏసీ

**గురుకులాల కాంట్రాక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**GO-17 అమలుపై బహిరంగ చర్చకు తాము సిద్ధం**

**కాంట్రాక్టర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మంద శ్యామ్**

హనుమకొండ, జూన్ 12 : గురుకులాల్లో రూ.2,000 కోట్ల కుంభకోణం జరిగిందన్న మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలపై స్పందించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ కాంట్రాక్టర్స్ జేఏసీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం హనుమకొండలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర చైర్మన్ మంద శ్యామ్ ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్టర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద శ్యామ్ మాట్లాడుతూ గురుకులాల్లో కాంట్రాక్టుల కేంద్రీకరణ (సెంట్రలైజేషన్) విధానంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విధానంలో కాంట్రాక్టుల కేటాయింపులు జరిగాయని.. దీనిపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు కేవలం సాంఘిక సంక్షేమ గురుకులాలకే పరిమితం కావని.. బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,కస్తూర్బా విద్యాలయాలు,హాస్టళ్లు,ప్రభుత్వ పాఠశాలలు తదితర అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన అంశమేనని ఆయన పేర్కొన్నారు. GO-17 అమలు, కాంట్రాక్టుల కేంద్రీకరణ వెనుక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో GO-17 అమలుపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని,ప్రభుత్వం కూడా ముందుకు రావాలని సవాల్ విసిరారు. అదేవిధంగా చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లలో ఇచ్చిన హామీల మేరకు అన్ని రంగాల్లో బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలకు తగిన వాటా కల్పించే విధానాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బొల్లే మధుకర్,బీఆర్‌ఎస్ నాయకురాలు పుష్పి తలయ, రాష్ట్ర కో-కన్వీనర్ శనిగరం శ్రీనివాస్,రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్ మారపెల్లి మనోజ్,ఒంటెరు చక్రి,బొల్లారం రమాకాంత్,తేళ్లూరి సురేష్,అల్లూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పునఃప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలి

**అదనపు కలెక్టర్ డా. అశ్వని తానాజీ వాకడే**



కరీంనగర్ రూరల్, జూన్ 12(వాయిస్ టుడే): పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి డాక్టర్ అశ్వని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి మండలంఎలగందల్ విద్యాసంస్థలను సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలగందల్ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, కేజీబీవీ మరియు సాంఘిక సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన ఆమె,అక్కడ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భవనాల మరమ్మతులు, తాగునీరు,పారిశుద్ధ్యం, విద్యుత్ మరియు ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.పరిశీలనలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి,పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యాసంస్థలను సన్నద్ధం చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్న అదనపు కలెక్టర్,ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో టీజీ డబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్,ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్,కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మ ఆనందం, సర్పంచ్ నిమ్మల అంజయ్య, ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దుబాయిలో 'బుర్జీల్' ప్రతినిధులను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**సహాయం ప్రకటించిన డా. షంషీర్ వయలిల్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానించిన ఎమ్మెల్యే**

**మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష దిర్హాంలు (రూ. 26 లక్షలు) సహాయం**



కరీంనగర్, జూన్ 12(వాయిస్ టుడే): ఇటీవల దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికులు,గాయపడిన తొమ్మిది మందికి 10 లక్షల దిర్హాంలు (రూ. 2.60 కోట్లు) మానవతా సహాయ ప్యాకేజీ ప్రకటించిన యూఏఈ కి చెందిన బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త,బిలియనీర్ డా. షంషీర్ వయలిల్ కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేనందున,ఆయన కంపెనీ ప్రతినిధులు ఎ.విజయ కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్,ఎం.ఉన్ని కృష్ణన్,డా.పంకజ్ కుమార్ భట్ లను శుక్రవారం దుబాయిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే వెంట తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ కొట్టాల సత్యం గౌడ్, దుబాయి లోని తెలంగాణ సామాజిక కార్యకర్తలు జువ్వాడి శ్రీనివాస రావు, శామ్యూల్ దామెర,సలావుద్దీన్,ఎస్వి రెడ్డి,ద్యాగతి మహిపాల్ యాదవ్, సుతారి సత్యనారాయణ,కోరెపు మల్లేష్,ముత్యం శంకర్ ఉన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం, డా.షంషీర్ వయలిల్ తో సహా 'బుర్జీల్' ప్రతినిధులను హైదరాబాద్ కు ఆహ్వానించారు.సీఎం ఏ.రేవంత్ రెడ్డి సమక్షంలో మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేద్దామని ప్రతిపాదించారు. ప్రమాదంలో మృతిచెందిన ఏడుగురిలో,ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందిన వారున్నారు. ఒక్కొక్కరికి లక్ష దిర్హాంలు (రూ.26 లక్షలు) చొప్పున ఆర్థిక సహాయం అందనున్నది.గాయపడిన తొమ్మిది మందికి వైద్య చికిత్స,పునరావాసం, ప్రభావిత కుటుంబాల పిల్లల విద్య కోసం కూడా సహాయం చేస్తారు. అంతకు ముందు రోజు ఎమ్మెల్యే దుబాయి లోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించి కాన్సులేట్ అధికారులను కలుసుకున్నారు.మృతదేహాల తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు.ప్రమాదంలో గాయపడ్డవారిని రాషేద్ ఆసుపత్రిలో పరామర్శించారు.ఎమ్మెల్యే పర్యటనను దుబాయిలోని సామాజిక కార్యకర్తలు గుండెల్లి నర్సింలు, సుతారి సత్యనారాయణ, హైదరాబాద్ నుంచి ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,మెంబర్ నంగి దేవేందర్ రెడ్డి సమన్వయం చేశారు.

## మోదీ పుష్కర పాలన ఎట్లుంది

**మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై ఆటో డ్రైవర్‌కు పుస్తకాలను అందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**



కరీంనగర్,జూన్ 12(వాయిస్ టుడే): నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై వివరిస్తూ వివిధ వర్గాలను కలుస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆటో డ్రైవర్ ను కలిశారు. ఆటోలో ఎక్కి కాసేపు ప్రయాణించారు.స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం రేకొండ గ్రామానికి విచ్చేసిన బండి సంజయ్ తిరుగు ప్రయాణంలో రేకొండ ఆటో స్టాండ్ వద్ద ఆగారు.కరీంనగర్ వైపు వెళుతున్న ఆటోలో ఎక్కారు.దిలీప్ అనే ఆటో డ్రైవర్ ను పలకరిస్తూ మోదీ 12 ఏళ్ల పాలన ఎట్లుందంటూ ఆరా తీశారు.మోదీ అనేక పథకాలను అమలు చేశారు.ఉచిత బియ్యం మోదీ ఇస్తున్నారు.ఉజ్వల గ్యాస్ ఇస్తున్నారు.గ్రామాలకు రోడ్లన్నీ మోదీ ప్రభుత్వం వేసినవే.జాతీయ రహదారుల పైసలన్నీ కేంద్రానివే. కరీంనగర్ జగిత్యాలకు నిధులు మంజూరు చేశారు.12 లక్షల ఉద్యోగాలిచ్చారు.గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీలకు పెద్ద ఎత్తున పైసలిస్తున్నారు.ఆ నిధులతోనే గ్రామాలు,పట్టణాల అభివృద్ధి చెందుతున్నాయి"అని వివరించారు.దేశంలో 4 వేల రోజులకుపైగా పాలన కొనసాగిస్తున్న ఏకైక ప్రధాని మోదీ.ఆయన నిరంతరం పేదల కోసమే పనిచేస్తున్నారు.పేదల పాలిట దేవుడు నరేంద్రమోదీ.ఆటో డ్రైవర్ గా నువ్వు రోజు కనీసం వంద మందినైనా కలుస్తుంటావ్. రాజకీయాలకు అతీతంగా మోదీ ఈ దేశానికి చేస్తున్న మంచి పనులను చెప్పాలి.మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ దేశానికి మరింత సేవ చేయాలని కోరుకుందాం అని చెప్పారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపైనా బండి సంజయ్ ఆరా తీశారు.ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల అసంత్రుప్తితో ఉన్నారంటూ ఆటో డ్రైవర్ బదులిచ్చారు.ఏ వర్గాలు ఎక్కువగా

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**

# నీట్,ఐఐటి పరీక్షల్లో అవకతవకలు దేశ ప్రతిష్టకు భంగం: నరేందర్ రెడ్డి

## ఐఐటి అడ్వాన్స్డ్ పేపర్ లీక్ చరిత్రలో తొలిసారి

## కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఆవేదన




కరీంనగర్, జూన్ 12(వాయిస్ టుడే); ప్రతిష్టాత్మక ఐఐటి మరియు నీట్ పరీక్షలలో అవకతవకలు జరగడం దేశ ప్రతిష్టకు భంగం కలుగుతుందని, అన్ని పరీక్షల్లో అవకతవకలు జరగడం,నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించడం విద్యా వ్యవస్థకు సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద ఎన్ఎస్‌యుఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ నిరసన ర్యాలీకి కాంగ్రెస్ నేత అల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ హాజరై నీట్ పరీక్ష రద్దు చేయడం,మళ్ళీ నిర్వహించడం చాలా అవమానకరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయడం చాలా అవమానకరమని తెలిపారు.ఇటీవల చాలామంది యువకులు, విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో సైతం నీట్ మరియు ఐఐటి పరీక్షల రద్దు పట్ల నిర్వహించిన ధర్నా కార్యక్రమం ప్రభుత్వానికి గుణపాఠం లాంటిదని వారు చెప్పారు.సాంకేతిక సమస్యలైన డేటా లభించకపోవడం, సర్వర్ మొరాయించడం,సాంకేతిక లోపాలు అధికంగా ఉండడం,సరైన పర్యవేక్షణ లోపించడం మన విద్యా విధానానికి అడ్డంకిగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.చైనా దేశంలో పరీక్ష పేపర్లు లీక్ చేసిన వారికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తారని గుర్తుచేశారు.ఈ సంవత్సరం ఐఐటి రూర్కీ వారు ఐఐటి అడ్వాన్స్డ్ పరీక్ష నిర్వహించారని గుర్తు చేశారు.పరీక్షల నిర్వహణలో తప్పులు ఉన్నాయని, అవకతవకలు చోటుచేసుకున్నాయని విచారం వ్యక్తం చేస్తూ,ఐఐటి రూర్కీ సంస్థకు ప్రశ్నపత్రాలను సిద్ధం చేసే బాధ్యత నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.చరిత్రలో మొట్టమొదటిసారిగా ఐఐటి అడ్వాన్స్డ్ పేపర్ కూడా లీక్ అవ్వడం చాలా బాధాకరమన్నారు. అడ్వాన్స్డ్ పరీక్ష చాలా కీలకమైనదని,ప్రపంచంలో మన విద్యా వ్యవస్థకు ఎంతో గౌరవం ఉందని, కానీ ఈ పేపర్ లీకేజీ వల్ల ఆ గౌరవం క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు.మొట్టమొదటిసారిగా ఐఐటి అడ్వాన్స్డ్ ప్రశ్నపత్రంలో తప్పులు ఉన్నాయని,భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు.నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్ష రాసే వారు పేపర్ మళ్లీ లీక్ అవుతుందని సవాల్ విసిరినా,కేంద్ర ప్రభుత్వం పట్టించుకోనట్లుగా వ్యవహరించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల జంతర్ మంతర్ వద్ద చేసిన మహా ధర్నా కార్యక్రమం ప్రభుత్వానికి కనువిప్పు కావాలని చెప్పారు. సీబీఎస్ఈ 10,12వ తరగతి ఫలితాల్లో సైతం చాలా అవకతవకలు ఉన్నాయని,పేపర్లు దిద్దడంలో నిర్లక్ష్యం వహించి తప్పులు చేశారని ఆరోపించారు.ఆన్‌లైన్ పద్ధతిలో పేపర్లను దిద్దినప్పటికీ తప్పులు దొర్లడం అవమానకరమన్నారు. అభివృద్ధి పథంలో పయనిస్తున్న భారతదేశంలో విద్యా వ్యవస్థ కుప్పకూలడం విచారకరమని,ఇది మన అభివృద్ధిని సైతం ప్రభావితం చేస్తుందని వారు చెప్పారు. ప్రధానమంత్రి తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి తొలగించడమే కాకుండా,లోక్‌సభ సభ్యత్వాన్ని సైతం రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా జాతీయ స్థాయి పరీక్షలను సజావుగా నిర్వహించాలని హెచ్చరించారు.లక్ష ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ప్రభుత్వం ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చిందని ప్రశ్నించారు.ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్,జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్,సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి,చింతల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిమ్ ఫహద్,గుర్రం వాసు గౌడ్, రెహమాన్, రమేష్,విక్రమ్, ఎండి అయాన్,సిహెచ్ చేతన్ రెడ్డి, సోఫియాన్,అన్సారీ,అనిల్,రేవంత్ పాల్గొన్నారు.




## అక్రమ రవాణా, డ్రగ్స్‌పై అవగాహన

ముదిగొండ మండలం జూన్ 12 వాయిస్ టుడే: ఆడపిల్లల అక్రమ రవాణా, డ్రగ్స్, సైబర్ ట్రాఫికింగ్‌పై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, వెంకటాపురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు అక్రమ రవాణా, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కందుల బాలచందర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండి చదువు, ఉద్యోగాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంట వెంకట్రావు, బంక వీరబద్ర మహారాజ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



## కోహీర్ షాహీన్ స్కూల్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందుకున్న మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్

ఝరాసంగం జూన్12 (వాయిస్ టుడే) : కోహీర్ పట్టణంలో నూతనంగా ప్రారంభం కానున్న షాహీన్ స్కూల్ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్‌కు పాఠశాల నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు.ఈ సందర్భంగా మొహమ్మద్ తన్వీర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి షాహీన్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. కోహీర్ పట్టణంలో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల నూతన బ్రాంచ్ విజయవంతం కావాలని యాజమాన్యానికి ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు అండగా ఉంటా..

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ, (వాయిస్ టుడే) : వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన మేధరి మోహన్‌బాబు,బిట్ల కొమురమ్మ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి,మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామ బీఆర్ఎస్ నాయకులు అప్పే నాగార్జున శర్మ తండ్రి అప్పే నాగేశ్వర ప్రసాద్ శర్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల వేలం పాటను అడ్డుకుంటాం..

### ప్రజల ఆస్తులను అమ్మేయాలని చూస్తే ఊరుకోం బీజేపీ రాష్ట్ర నాయకులు రావు పద్మ రెడ్డి హెచ్చరిక



హనుమకొండ,వాయిస్ టుడే: వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (KUDA) పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను,ప్లాట్లను వేలం వేయాలని చూస్తే బీజేపీ ఆధ్వర్యంలో తీవ్రంగా అడ్డుకుంటామని బీజేపీ రాష్ట్ర నాయకులు రావు పద్మ రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల 'కుడా' విడుదల చేసిన వేలం నోటిఫికేషన్ లో హనుమకొండ బాలసముద్రంలోని ప్రైమ్ కమర్షియల్ ప్లాట్లను వేలం వేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేయడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రజల అవసరాల కోసం,ప్రభుత్వ ఆసుపత్రులు,పాఠశాలలు,లేదా ఇతర ప్రజా ప్రయోజనార్థం ఉపయోగపడే భూములను మిగల్చకుండా కేవలం ఇప్పటి అవసరాల కోసం ఇలా భూములను తెగనమ్మడం బాధ్యతారాహిత్యమన్నారు. ప్రభుత్వం కేవలం ఆదాయమే పరమావధిగా భావించి ప్రజల ఆస్తులను అమ్మేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఆదాయం కావాలనుకుంటే ఇతర వనరులను,ప్రత్యామ్నాయ మార్గాలను వాడుకోవాలే తప్ప..వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న విలువైన భూములను వేలం వేయడం సరికాదన్నారు. వెంటనే ఈ వేలం ప్రక్రియను నిలిపివేయాలని..లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రావు పద్మ రెడ్డి హెచ్చరించారు.



## పార్టీకి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెబుతాం

### పార్టీ కోసం పని చేసేవారిని గుండెల్లో పెట్టుకుంటాం

### కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు

### మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

### 11, 29వ డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం

హనుమకొండ,వాయిస్ టుడే: పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటామని,పార్టీకి ద్రోహం చేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని.. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 11, 29వ డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశాన్ని శుక్రవారం రామన్నపేటలోని మణిదీప గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆశీర్వాదం,దేవుని అనుగ్రహం,కార్యకర్తల కృషితో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు తెలిపారు. తనకు రాజకీయాలే జీవితం,ప్రజాసేవే ధ్యేయమని పేర్కొన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. కరోనా సమయంలో దాదాపు 60 వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించి, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకుంటామని, రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలోకి వచ్చి పదవులు పొంది మళ్లీ పార్టీలు మారినా తమకు ఎలాంటి నష్టం లేదన్నారు. పార్టీ మారిన వారి విషయంలో కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కష్టకాలంలో ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. 20 ఏళ్ల ప్రజా జీవితంలో తాను ఎప్పుడూ ప్రతీకార రాజకీయాలు చేయలేదని,అర్హులైన వారికి పార్టీలు అతీతంగా సంక్షేమం,అభివృద్ధి అందించానని చెప్పారు. కేసులకు భయపడబోమని, తమ నాయకులను వేధించే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ,కేసీఆర్,తాను ఎప్పుడూ పేదల పక్షాన నిలిచామని..అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నిరాశపరుస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్నా లేకున్నా పేదల పక్షాన పోరాడుతూనే ఉంటానన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చిన ఆయన రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా మళ్లీ ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.



## 'మన బడి మన బాధ్యత,స్వచ్ఛ పాఠశాల కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్,జూన్ 12(వాయిస్ టుడే): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు కరీంనగర్ 42వ డివిజన్ భగత్ నగర్ లోని పోలీస్ కోటర్స్ గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించనున్న 'మన బడి – మన బాధ్యత,స్వచ్ఛ పాఠశాల'కార్యక్రమ ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు నగరపాలక సంస్థ మాజీ మేయర్ ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహించిన టిఫిన్ బైఠక్ లో డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యానికి, విద్యాభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు.నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు,కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు.ఈ కార్యక్రమంలో 42వ డివి జన్ బీజేపీ నాయకులు,కార్యకర్తలు కన్నమల్ల శ్రీనివాస్,భీమరి సత్యం,రాజ్ ప్రభాకర్, రమేష్ గౌడ్, డోలి ఉపేందర్, వర్ధినేని వెంకట్ రావు,అనుదీప్, కుంభం అనిల్ కుమార్, గీకురు ఆంజనేయులు, దాసరి రమేష్, లట్టు, మల్లేశం, సాయి, రోహిత్, పాల్గొన్నారు.




## క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

### కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, జూన్ 12(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ మరియు జిల్లా యువజన, క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలబాలికల కోసం నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు.మే 11న అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమైన ఈ వేసవి క్రీడా శిబిరం జూన్ 12 వరకు విజయవంతంగా కొనసాగిందని తెలిపారు.దాదాపు 17 క్రీడా అంశాలలో 28 మంది అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ అందించగా,ఈ ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 1400 మంది బాలబాలికలు పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు.క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలు,జట్టు భావన మరియు క్రమశిక్షణను పెంపొందిస్తాయని మేయర్ తెలిపారు.చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని,క్రీడలు విద్యార్థులను మానసికంగా దృఢంగా తీర్చిదిద్దుతాయని అన్నారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నగరపాలక సంస్థ తరపున పాలు, గుడ్లు, అరటిపండ్లు,తాగునీరు వంటి పౌష్టికాహార సదుపాయాలు కల్పించడంతో పాటు కోచ్‌లకు తగిన గౌరవ వేతనం అందించినట్లు వివరించారు. భవిష్యత్తులో కరీంనగర్‌కు చెందిన క్రీడాకారులు రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించేలా అవసరమైన ప్రోత్సాహం,వసతులు కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని మేయర్ స్పష్టం చేశారు.విద్యార్థుల అభ్యర్థన మేరకు రాబోయే రోజుల్లో 3 నుంచి 5 ప్రధాన క్రీడా అంశాలలో ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా శిబిరాన్ని విజయవంతం చేసిన జిల్లా క్రీడా శాఖ అధికారులను, కోచ్‌లను, తల్లిదండ్రులను,పాల్గొన్న విద్యార్థులను మరియు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,కార్పొరేటర్ రవీందర్ సింగ్,అడిషనల్ కలెక్టర్ సువార్త మరియు మహమ్మద్ ఆయాజ్,డి వై ఎస్ ఓ శ్రీనివాస్ గౌడ్,ఒలింపిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ జనార్ధన్ రెడ్డి,ఎస్ జిఎఫ్ సెక్రెటరీ వేణు గోపాల్,నగరపాలక సంస్థ అధికారులు,కో–ఆప్షన్ సభ్యులు, క్రీడాకారులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## కరీంనగర్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలి

కరీంనగర్, జూన్ 12(వాయిస్ టుడే): ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా , శిశు సంక్షేమ శాఖ,కార్మిక శాఖ, పోలీసు శాఖ,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సమన్వయంతో కరీంనగర్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.జిల్లా పరిషత్ కార్యాలయం నుండి గీత భవన్ చౌరస్తా వరకు కొనసాగిన ర్యాలీని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి , జిల్లా కార్మిక శాఖ అధికారి ప్రసాద్ ప్రారంభించారు.ర్యాలీ సందర్భంగా వివిధ దుకాణాలు, వాణిజ్య సంస్థలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులు పనిచేస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు.బాల కార్మికులు లేని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించి,బాల కార్మికుల రహిత దుకాణం స్టిక్కర్లను అంటించారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగశేఖర్,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధి చంద్రప్రకాశ్ రెడ్డి,సీడీపీఓలు,చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్,బాలల పరిరక్షణ సిబ్బంది శాంత, తిరుపతి, సాదినేని రమేష్, కార్మిక శాఖ అధికారులు,పోలీసు టాస్క్ ఫోర్స్ సిబ్బ, అధికారులు పాల్గొన్నారు.